వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్



తాగునీటి సమస్య రాకూడదు

- తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
- పింఛన్ల పంపిణీలో సమస్యలు తలెత్తకూడదు
- కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 1: వేసవిలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం విజయవాడ, వెలగపూడి సచివాలయం నుంచి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ తాగునీటి సరఫరా, పింఛన్ల పంపిణీ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వేసవి కాలంలో జిల్లాలో ఎక్కడా కూడా తాగునీటి ఎద్దడి ఎదురుకాకుండా చూడాలన్నారు. భూగర్భజలాలు అడుగంటిపోయాయని, వచ్చే రెండు, మూడు నెలలు చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీవోలు ముందుగానే ప్రతి స్కీంను పరిశీలన చేసుకుని అవి పనిచేసేలా చూడాలన్నారు. తాగునీటి కోసం విద్యుత్ సమస్య రాకుండా ఎప్పటికప్పుడు ఏపీఎస్పీడీసీఎల్ అధికారులతో సంప్రదించాలన్నారు. జిల్లాలో మొత్తం 2.26 లక్షల పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పింఛన్ల పంపిణీకి సంబంధించి త్వరలో నూతన మార్గదర్శకాలు ఇస్తామన్నారు. మార్చి 31వ తేదీ ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా ఏప్రిల్ 1వ తేదీ ఇవ్వాల్సిన పింఛన్లు ఏప్రిల్ 3వ తేదీ మధ్యాహ్నం నుంచి గానీ, 4వ తేదీ ఉదయం నుంచి పింఛన్లు ఇస్తామని తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన పేదలందరికీ జాబ్‌కార్డులు మంజూరు చేసి పని కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని పేదల కోసం సమర్థవంతంగా నిర్వహిస్తోందని ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు మెరుగైన జీవనోపాధి కల్పించే విధంగా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. పని చేసే ప్రాంతంలో కూలీలకు ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నీరు, షామియనాలు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ వంటి అన్ని వసతులు ఉండేటట్లు చూడాలన్నారు. కూలీలు వలసపోకుండా ఉండాలంటే పని దినాలను పెంచాలని, పనులు లేని ప్రాంతాల్లో రహదారుల పక్కన ముళ్ల పొదలను తొలగించడం, రోడ్డు విస్తరణ వంటి పనులు చేయించాలన్నారు.

తాగునీరు ఇప్పించండి సారూ..

- కలెక్టరేట్ ముందు ఖాళీ బిందెలతో నిరసన




ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న కాటిమాయకుంట దళితవాడ వాసులు

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 1: రెండు నెలలుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాము, మాకు తాగునీరు ఇప్పించండి అని రాయచోటి మండలం కాటిమాయకుంట దళితవాడకు చెందిన ప్రజలు ఖాళీ బిందెలతో కలెక్టరేట్ ముందు సోమవారం నిరసన తెలియచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ఒక బోరు రెండు నెలలుగా చెడిపోయి చాలా ఇబ్బందులు పడుతున్నామని, మా సమస్య గురించి పట్టించుకునే వారే లేరని గ్రామస్థులు వాపోయారు. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంతో కలెక్టరేట్‌కు రావాల్సి వచ్చిందని వారు తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

నేడు కడప జిల్లాలో వైఎస్ షర్మిల పర్యటన

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 1: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు తెలిపారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు విష్ణుప్రీతంరెడ్డితో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పీసీసీ అధ్యక్షురాలు మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి కడప విమానాశ్రయానికి చేరుకుంటారన్నారు. 2 గంటలకు రోడ్డు మార్గాన వెళ్లి ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌ను సందర్శించి తిరిగి కడపకు వస్తారన్నారు. సాయంత్రం 5-30 గంటలకు కడప అమీన్ ఫంక్షన్ ప్యాలెస్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొని రాత్రికి తిరిగి ఇడుపులపాయకు చేరుకుని అక్కడే బస చేస్తారన్నారు. బుధవారం హైదరాబాదు వెళతారని తెలిపారు.

వరదల్లో కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు మట్టికట్ట



మదనపల్లె మండలంలో విస్తరణకు నోచుకుని హంద్రీ-నీవా పుంగనూరు బ్రాంచి కెనాల్ పనులు



ఏం చేశారని సిద్ధం..



- తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టు కట్టారా?
- జిల్లాకు ఒక పరిశ్రమ అయినా తెచ్చారా?
- ఇచ్చిన హామీలు నెరవేర్చారా?
- ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తున్న జిల్లావాసులు
- నేడు అన్నమయ్య జిల్లాలో ముఖ్యమంత్రి బస్సు యాత్ర

రాయచోటి/మదనపల్లె, (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో జిల్లాకు మీరు ఏం చేశారని.. మేమంతా సిద్ధంగా ఉండాలి జగనన్నా.. తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టు, పింఛా ప్రాజెక్టులను నిర్మించారా? జిల్లాకు ఒక పరిశ్రమ అయినా తెచ్చారా? ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్ర సందర్భంగా అధికారంలోకి వస్తే.. చేస్తామన్న.. హామీలు నెరవేర్చారా? అని ముక్తకంఠంతో ప్రశ్నిస్తున్నారు. మీరొస్తే మేమెందుకు సిద్ధంగా ఉండాలి అని అడగడానికి సిద్ధంగా ఉన్నారు. మేమంతా సిద్ధం పేరుతో జిల్లాలో ముఖ్యమంత్రి చేపట్టబోయే బస్సు యాత్ర మంగళవారం జిల్లాలోకి ప్రవేశించనుంది. ఎన్నికల ప్రచారానికి ముఖ్యమంత్రి జగన్ బుల్లెట్ ప్రూఫ్ బస్సులో వస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లా నుంచి ములకలచెరువు మండలంలో నుంచి జిల్లాలోకి ప్రవేశిస్తున్నారు. దీంతో అధికార పార్టీ జనసమీకరణపైన ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందుకు వందలాది ఆర్టీసీ బస్సులను సమకూర్చుకుంటోంది. ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా ఆర్టీసీ బస్సులను జనాలను తరలించేందుకు భారీగా తీసుకోవడంతో బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

2020 నవంబరు 19న రాజంపేట మండలంలో ఉన్న అన్నమయ్య ప్రాజెక్టు వరదకు కొట్టుకుపోయింది. ఈ ప్రమాదంలో 30 మంది మృత్యువాత పడ్డారు. వందల కోట్ల రూపాయల ఆస్తినష్టం జరిగింది. వేల సంఖ్యలో పశు సంపద ప్రాణాలు కోల్పోయింది. ప్రాజెక్టు కొట్టుకుపోయిన రెండు రోజులకు ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే చేసి వెళ్లారు. అయితే చంద్రబాబు వరద ధాటికి దెబ్బతిన్న గ్రామాలలో పర్యటించి ప్రతి ఇంటికీ వెళ్లి బాధితులను పరామర్శించారు. బాధితులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీంతో ప్రమాదం జరిగిన సుమారు 10 రోజుల తర్వాత ముఖ్యమంత్రి జగన్ అన్నమయ్య ప్రాజెక్టు దిగువన ఉన్న గ్రామాలలో పర్యటించారు. ఇళ్లు కోల్పోయిన వారికి మూడు నెలల్లో ఇళ్లు కట్టించి చేతికి తాళాలు ఇస్తానని ప్రకటించారు. ప్రాజెక్టు కొట్టుకుపోయి ఇప్పటికి మూడు సంవత్సరాలు గడుస్తున్నా కనీసం ఒక ఇల్లు కూడా పూర్తి కాలేదు. ప్రాజెక్టు నిర్మాణానికి రూ.800 కోట్లతో ప్రతిపాదనలు పంపినప్పటికీ ఇప్పటికీ కనీసం చిన్న రాయి కూడా పెట్టలేదు. అసలు రూ.4 కోట్లు ఖర్చు చేసి ఉంటే ప్రాజెక్టు కొట్టుకుపోయేదే కాదని రైతులు వాపోతున్నారు. ఈ ప్రాజెక్టు కొట్టుకుపోయిన రోజే పింఛా ప్రాజెక్టు కూడా కొట్టుకుపోయింది. దీని పరిస్థితి ఇంతే. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే.

- మదనపల్లె పట్టణంలో తాగునీటి శాశ్వత పరిష్కారానికి చిప్పిలి, వలసపల్లె పంచాయతీలోని గుట్టకింద పల్లె సమ్మర్ స్టోరేజీ (ఎస్ఎస్ ట్యాంకులు) పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అయితే నేటికీ ఆ పనులు పూర్తి కాలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రిజర్వాయర్లు పూర్తయి మొరవ పనులు పూర్తి కాలేదు. ఈ ఐదేళ్లలో కనీసం పారపట్టి తట్టెడు మట్టి కూడా ఎత్తలేదు. మదనపల్లె నుంచి నిమ్మనపల్లె, రామసముద్రం మండలాలకు కలుపుతూ డబుల్ రోడ్డు నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీ అతీగతీ లేదు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించడానికి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. మదనపల్లె పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీర్చుతామన్న హామీకి దిక్కూమొక్కూలేదు.
- మదనపల్లె మీదుగా వెళ్తున్న హంద్రీ-నీవా నీటిని నియోజకవర్గం పరిధిలోని బాహుదానదికి మళ్లిస్తామని రైతులకు ఇచ్చిన హామీ ఈ ఐదేళ్లలో నీటి మూటగానే మిగిలిపోయింది. పుంగనూరు బ్రాంచికెనాల్ నుంచి హంద్రీ-నీవా జలాలను రామసముద్రం మండలానికి తీసుకెళ్లి అక్కడి చెరువులను నింపుతామన్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా మాటలు నీటమూటలుగా మిగిలిపోయాయి.
- జిల్లాలో టమోటా ఆధారిత పరిశ్రమ, శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయడం ద్వారా రైతుకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్న హామీ ఏమీ లేకుండానే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పదవీకాలం ముగిసిపోయింది. జిల్లాలో పలుచోట్ల షాదీమహాళ్లు నిర్మిస్తామని ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ నెరవేరలేదు.
- నీరుగట్టువారిపల్లెలో చేనేత మగ్గాలు నిర్వహిస్తున్న నివాసాలు, భవనాలకు విద్యుత్తు మీటర్లు, మున్సిపల్ ఆస్తిపన్ను కమర్షియల్ కేటగిరీలో వస్తున్నాయి. వీటిని రెసిడెన్షియల్ కింద మార్పు చేస్తామని హామీ ఇచ్చినా అవి అమలు కాలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో ఒక్కో చేనేత కార్మికుడి సిల్కుపై కేజీపై రూ.200 సబ్సిడీతో నెలకు గరిష్ఠంగా 4 కిలోలకు రాయితీ వస్తుండగా, వైసీపీ అధికారంలోకి రాగానే, ఈ విధానాన్ని రద్దు చేసింది.
- 2017, 2018లో తంబళ్లపల్లె నియోజకవర్గంలో ప్రజాసంకల్పయాత్ర పేరుతో జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్ర చేపట్టారు. తంబళ్లపల్లె నియోజకవర్గానికి హంద్రీ-నీవా ద్వారా సాగునీరు అందించడం, తంబళ్లపల్లె నియోజకవర్గంలో అధికంగా ఉన్న ఫ్లోరెడ్ సమస్య పరిష్కరించి వేరుశెనగ, మామిడి, టమోటా పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. అయితే ఇందులో ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. ములకలచెరువు వ్యవసాయ మార్కెట్ కమిటీలో కనీస వసతులు లేవు. ఈ ఐదేళ్లలో ప్రభుత్వం ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదు.
- గండికోట జలాలను గాలేరు-నగిరి కాలువను హంద్రీ-నీవాలో అనుసంధానం చేస్తూ చేట్టిన పనుల్లో భాగంగా పెద్దమండ్యం, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం మండలాల్లో భూములు కోల్పోన రైతులకు నష్టపరిహారం ఇంకా ఇవ్వలేదు. రాయలసీమలోనే అతిపెద్ద గొర్రెల సంతగా పేరుగాంచిన కురబలకోట సంతలో కనీస సౌకర్యాలు కల్పించలేదు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, పెద్దమండ్యం, తంబళ్లపల్లె, కురబలకోట, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల్లోని ప్రధాన చెరువుల ఆయకట్టు భూములు సాగుకు నోచుకోక నిరుపయోగంగా మారాయి. టీడీపీ హయాంలో చేపట్టిన నీరు-చెట్టు పథకాన్ని వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడంలో కంపచెట్లు భారీగా పెరిగి, ఆయకట్టు భూములు అడవులను తలపిస్తున్నాయి. పెద్దమండ్యం మండలంలో నల్లరాతి మడుగు ప్రాజెక్టు పనులు చేపట్టలేదు. పనులు తొలి దశలోనే ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా రోడ్ల పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. ప్రజల ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేయాల్సి వస్తోంది.

నేడు ములకలచెరువులో జగన్ రోడ్ షో

తంబళ్లపల్లె నియోజకవర్గంలో మంగళవారం సీఎం జగన్ రోడ్‌షో జరగనుంది. శ్రీసత్యసాయి జిల్లాలో సోమవారం రాత్రి బస్సుయాత్ర ముగించుకుని అన్నమయ్య జిల్లాలోకి ప్రవేశించింది. శ్రీసత్యసాయి-అన్నమయ్య జిల్లాల సరిహద్దు సమీపంలో సీఎం జగన్ రాత్రి బస చేశారు.

మంగళవారం ఉదయం 9 గంటలకు ములకలచెరువు, పెద్దపాళ్యం, బి.కొత్తకోట మండలం గోళ్ళపల్లె, కురబలకోట మండలం అంగళ్లు మీదుగా రోడ్‌షో జరగనుంది. అనంతరం విశ్వం కాలేజీ సమీపంలో మధ్యాహ్న భోజన విరామం తరువాత మదనపల్లెలో జరిగే మేమంతా సిద్ధం సభలో జగన్ పాల్గొంటారని సీఎంవో అధికారులు ప్రకటించారు.



మదనపల్లెలో మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడు



మదనపల్లెలోని ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం పూర్తయినా మట్టికే పరిమితమైన మొరవ పనులు

'నీరు'గార్చారు..!



అర్ధంతరంగా ఆగిన వాటర్ ట్యాంకు పనులు

- నీరిస్తామని ఐదేళ్ల నుంచి దాటవేత
- కలగానే రోళ్లమడుగు నీటి పథకం
- అర్ధంతరంగా ఆగిన పైపులైన్, ట్యాంకుల నిర్మాణం
- కొత్త వాగ్దానాలతో మళ్లీ మోసానికి సిద్ధం

సుండుపల్లె, ఏప్రిల్ 1: రోళ్లమడుగు నుంచి నీరిస్తామని గత ఎన్నికల సమయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఇచ్చిన హామీలు కలగానే మిగిలిపోయాయి. రోళ్లమడుగు నీటి పథకంతో కరువు సీమలో ప్రజల దాహార్తి తీరుస్తుందని ఎదురుచూస్తున్న ప్రజలకు నిరీక్షణే మిగులుతోంది. ఏడు సంవత్సరాల కిందట తెలుగుదేశం ప్రభుత్వంలో వెనుకబడిన ప్రాంతాలకు కేటాయించిన అభివృద్ధి నిధుల నుంచి రూ.50 కోట్లతో రోళ్లమడుగు నీటి పథకం మంజూరైంది. 2018 నాటికి పూర్తి కావాలన్నది లక్ష్యమైనా పనులు పూర్తి కాలేదు. కొన్ని పనులు పూర్తి కాగా వాటికి రూ.13 కోట్ల చెల్లింపులు జరిగాయి. ఆ తర్వాత గడువు దాటిపోవడంతో నిధులు నిలిచిపోయాయి. మూడేళ్లుగా నిధుల కేటాయింపుల కోసం ఎదురుచూపులే తప్ప అడుగు ముందుకు పడలేదు. రోళ్లమడుగు పథకం ప్రారంభంలో 163 పల్లెలకు తాగునీరు అందించడమే లక్ష్యం కాగా జీఎస్టీ రావడం, నూతన ధరల కారణంగా పనులు ప్రారంభమయ్యే సమయానికి లక్ష్యం 86 పల్లెలకు పరిమితమైంది. ఇప్పటి వరకు రోళ్లమడుగు సమీపంలో బాహుదా నదిలో రెండు ఇన్ఫిల్ట్రేషన్ బావులు, ఒక కలెక్షన్ బావి నిర్మాణం, ఫుట్‌బ్రిడ్జి నిర్మాణం మాత్రమే పూర్తయింది. విద్యుత్ సరఫరాకు అవసరమైన విద్యుత్ నియంత్రికలు ఏర్పాటు చేశారు. కొంతమేర ప్రధాన పైపులైన్ల నిర్మాణం పూర్తయింది. పది ఉపరితల ట్యాంకుల నిర్మాణం ప్రారంభమై అర్ధంతరంగా ఆగాయి. 1700 కిలో లీటర్ల సంప్ నిర్మాణంతో పాటు సానిపాయి సమీపంలో ఒక జీఎల్ఆర్ నిర్మాణం ఉంది. పొలిమేరపల్లె, చిన్నగొల్లపల్లె, మడితాడు, సుండుపల్లె, రాయవరం గ్రామాల పరిధిలో 86 పల్లెలకు ఈ పథకం పూర్తయితే నీరందుతుంది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెలుగుదేశం ప్రభుత్వంలో ఇంటింటికీ తాగునీటి కుళాయి ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ఈ పథకం ప్రారంభమైంది. అయితే అప్పటి ఎమ్మెల్యే పార్టీ మారడంతో నీటి పథకం పనులు నిలిచిపోయాయని టీడీపీ నాయకులు ఇప్పటికీ విమర్శిస్తూ ఉన్నారు. మళ్లీ 2024 ఎన్నికలు సమీపిస్తున్నాయి. తాగునీటి సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. శాశ్వత తాగునీటి సమస్యను పరిష్కరించి ఎన్నికలకు వస్తామని అధికార పార్టీ నాయకులు చెప్పిన హామీలు పరిష్కరించి ఎన్నికలకు వస్తారా లేదా..! అనేది వేచి చూడాలి.

అప్పుడు ప్రారంభించారనే ఆపేశారు

తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి ఏర్పాటు చేసి ప్రజలకు మంచినీటిని అందించాలన్న సంకల్పంతో రోళ్లమడుగు నీటి పథకాన్ని ప్రారంభించారు. టీడీపీ ప్రభుత్వంలో సుండుపల్లె మండల ప్రజలకు మంచి జరగాలని రోళ్లమడుగు నీటి పథకం ప్రారంభించడం మండల ప్రజలకు ఒక శాపంగా మారింది. 2019 ఎన్నికల తరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ ప్రభుత్వంలో ప్రారంభించిన నీటి పథకాన్ని పూర్తి చేస్తే టీడీపీకి మంచిపేరు వస్తుందని నీటి పథకాన్ని ఆపేశారని అధికార పార్టీపై ప్రజాప్రతినిధులపై తీవ్ర విమర్శలు ఉన్నాయి. ప్రజలకు మంచి జరిగినా కూడా ఓర్చుకోలేని వైసీపీ పాలనను మండల ప్రజలు ఛీకొడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. మళ్లీ 2024సార్వత్రిక ఎన్నికల కోడ్ వచ్చింది. సుండుపల్లె మండల ప్రజలను మోసం చేసేందుకు మరోమారు అదే పార్లమెంట్ అభ్యర్థి, అసెంబ్లీ అభ్యర్థి మార్పుతో సిద్ధమయ్యారని ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి. ఇదంతా మండల ప్రజలకు స్పష్టంగా తెలుసు. 14 గ్రామ పంచాయతీల్లో 236 పల్లెలకు తాగునీటిని అందించే పథకాన్ని రాజకీయ నాయకుల స్వార్థ ప్రయోజనాల కోసం తుంగలో తొక్కేశారని తెలుస్తుంది.

రూ.50 కోట్లతో ప్రతిపాదనలు..

జల్‌జీవన్ పథకం కింద రూ.50 కోట్లతో ప్రతిపాదనలు పంపించాము. నీటి పథకం పనులు పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు పంపించాము. ఇంకా రాలేదు. నిధులు మంజూరైతే పనులు ప్రారంభిద్దామని అనుకున్నాము. ఎన్నికల కోడ్ వచ్చింది. ఎన్నికల తర్వాత పనులు పూర్తి చేస్తాము.

- ప్రసాద్, ఏఈ, ఆర్‌డబ్ల్యుఎస్



పొలం నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న మహిళలు

గుక్కెడు తాగునీటిని అందించండి..



తాగునీటి సమస్య అధికంగా ఉంది. రోళ్లమడుగు నుంచి తాగునీరు అందిస్తామని ఎన్నికల సమయంలో నాయకులు ఇచ్చిన హామీలు మరిచిపోయారు. మళ్లీ 2024 సార్వత్రిక ఎన్నికలు వస్తున్నాయి. రోళ్లమడుగు నుంచి నీటిని తెప్పించి ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేస్తామని టీడీపీ ప్రభుత్వంలో పనులు ప్రారంభించారు. ఇప్పటికీ పూర్తి చేయకపోవడం బాధాకరం. తాగునీటిని అందించి పుణ్యం కట్టుకోండి.

- లక్ష్మీదేవి, చెన్నంశెట్టిపల్లె

కావాలనే ఆపేశారు..



తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో సుండుపల్లె మండలంలో మొదటి విడతగా 163 పల్లెలకు రెండో విడతలో మండల వ్యాప్తంగా తాగునీటిని అందించాలన్న సంకల్పంతో రోళ్లమడుగు నీటి పథకానికి శంకుస్థాపన చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సుమారు ఐదు సంవత్సరాల కాలంలో కనీసం పనులు ప్రారంభించకపోవడం దౌర్భాగ్యం. నీటి పథకం పూర్తయితే మండలంలో తాగునీటి సమస్య అనేది ఉండదు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం సాధిస్తుంది. మండల ప్రజలకు తాగునీరు అందించేలా చేస్తాము.

- వెంకట్రామరాజు, బీజేపీ జిల్లా నాయకుడు

పింఛన్ల పంపిణీపై
వైసీపీ అసత్య ప్రచారం

- రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు

చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, ఏప్రిల్ 1: వృద్ధాప్య, వికలాంగ పింఛన్లపై వైసీపీ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. పట్టణంలోని పార్లమెంటు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వలంటరీ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ పింఛన్ల పంపిణీపై ఎన్నికల కమిషన్ నిర్దేశాలు ఇచ్చిందని, దానిని ఓటు బ్యాంకుగా మార్చుకోవాలన్న దురుద్దేశ్యంతో వైసీపీ ప్రభుత్వం ఇదంతా తెలుగుదేశం పార్టీ చేస్తున్న కుట్ర అని ప్రచారం చేస్తోందని, ఇందులో ఎంతమాత్రం నిజం లేదన్నారు. దీనికి ముఖ్య కారణం వైసీపీ ప్రభుత్వం ఖజానాలో నిధుల కొరతే అని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే లబ్ధిదారులు ప్రతి ఒక్కరికీ 4 వేల రూపాయల పింఛన్‌ను అందిస్తామని తెలిపారు. వలంటీర్లు ప్రజాసేవ కార్యక్రమాలు కాకుండా వైసీపీకి తొత్తులుగా వ్యవహరిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన సీఎం జగన్ బస్సు యాత్రలో ప్రజలకు ఎలా మొఖం చూపుతారని ప్రశ్నించారు. రాజంపేటకు మెడికల్ కాలేజీ, జిల్లా హోదా, అన్నమయ్య ప్రాజెక్టు తెగి రెండు సంవత్సరాలు అవుతున్నా నిర్వాసితులకు సహాయ సహకారాలు పూర్తిస్థాయిలో అందించలేదని దుయ్యబట్టారు. ఒంటిమిట్ట ఎత్తిపోతల పథకం ద్వారా కనీసం చెరువు ఎండిపోతున్నా నీటిని విడుదల చేయడం లేదని ఇలాంటి అసమర్థ ముఖ్యమంత్రిని ప్రజలు ఏ విధంగా మళ్లీ ఎన్నుకుంటారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిన నేత చంద్రబాబు అని, ప్రజలు నేడు గుర్తించారని అధికారంలోకి తెలుగుదేశం పార్టీనే రావడం ఖాయమని ఆయన జోష్యం చెప్పారు. సమావేశంలో టీడీపీ పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి కోవూరు సుబ్రమణ్యంనాయుడు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సతీష్‌రాజు, సీనియర్ నేత జి.వి.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు

ఆటోను ఢీకొన్న టిప్పర్ ఇద్దరు మహిళా కూలీలు మృతి

● ఆటో డ్రైవర్, మరో మహిళకు తీవ్ర గాయాలు




మృతి చెందిన వెంకటలక్ష్మి, ఆదిలక్ష్మి

రాజంపేటటౌన్, ఏప్రిల్ 1: కూలీ పనుల కోసం ఆటోలో కూలీలు వెళుతుండగా ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరు మహిళలు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పోలి గ్రామం వద్ద సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రాజంపేట మండల పరిధిలోని హత్యరాల గ్రామానికి చెందిన కూలీలు కూలీ పనుల కోసం సోమవారం తెల్లవారు జామున ఆటోలో రాజంపేట వైపు బయలుదేరారు. పోలి గ్రామం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వెంకటలక్ష్మి (30) అక్కడికక్కడే మృతి చెందింది. ఆటో డ్రైవర్ మురళి, ఆదిలక్ష్మి మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే స్థానికులు గుర్తించి రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఆదిలక్ష్మి(25)ని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలిస్తుండగా పరిస్థితి విషమించడంతో మార్గమధ్యంలో మృతి చెందింది. ఈ సంఘటనపై రాజంపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా ఒకే రోజు హత్యరాల హరిజనవాడలో ఇద్దరు మహిళలు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి




నాగిరెడ్డి రమణారెడ్డి (ఫైల్), ట్రాన్స్‌ఫార్మరు వద్ద పడిపోయిన రమణారెడ్డి

బి.కోడూరు, ఏప్రిల్ 1: పొలంలో నీళ్లు కట్టేందుకు వెళ్లిన ఓ రైతు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. మండలం పరిధిలోని రెడ్డివారిపల్లె గ్రామానికి చెందిన నాగిరెడ్డి రమణారెడ్డి (38) శనివారం రాత్రి భార్య రామలక్షుమ్మకు తాను పొలం వద్దకు వెళుతున్నానని.. అటు నుంచే అటే తెల్లవారు జామున భూమిరెడ్డిపల్లె (అత్తగారి ఊరికి)కు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. పశువుల మేత కోసం వేసిన చొప్పకు నీళ్ల పారకట్టేందుకు మోటార్ ఆన్ చేసేందుకు స్టార్టరు నొక్కి చూశాడు. మోటరు ఆడకపోవడంతో ట్రాన్స్‌ఫార్మరు వద్దకు వెళ్లి ఫీజు పోయిందని గమనించి.. కదిలిస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయం అదే గ్రామానికి చెందిన కొంత మంది పశువులు మేపుకునేందుకు వెళ్లి చూడగా రమణారెడ్డి శవమై పడి ఉండడం గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు లబోదిబోమంటూ అక్కడకు చేరుకుని బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసు కెళ్లారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యాధికారులు తెలపడంతో బి.కోడూరు స్టేసన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ జయరాములు సంఘటనా స్థలాన్ని పరిశీలించి పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడికి ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

ఖాజీపేట, ఏప్రిల్ 1: మండల పరిధిలోని దుంపలగట్టులో అప్పులబాధతో విషద్రావణం తాగి బుక్కన శివశంకరయ్య (36) మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్లితే... దుంపలగట్టుకు చెందిన శివశంకరయ్య పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం సాగించేవాడు. సాగు చేసిన పంట చేతికి రాక అప్పులబాధతో శనివారం విషద్రావణం తాగాడు. అతన్ని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఖాజీపేట పోలీసులు తెలిపారు.

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 1: మదనపల్లె మండలం సీటీఎం గ్రామం వద్ద రైలు కింద పడి ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. కదిరి రైల్వే ఎస్‌ఐ రహీం కథనం మేరకు.. తిరుపతి నుంచి ధర్మవరం వైపు వెళుతున్న రైలు సీటీఎం అంజనేయస్వామి ఆలయం వద్దకు రాగానే అక్కడే వున్న ఓ మహిళ(34) హఠాత్తుగా రైలు కింద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు.

అంతుబట్టని తెగులు... ఎండుతున్న చీనీ తోటలు

● వేల ఎకరాల్లో దెబ్బతిన్న చెట్లు

● ఎలా కాపాడుకోవాలో దిక్కుతోచని స్థితిలో రైతులు

● కాపాడుకునేందుకు లక్షలు ఖర్చు చేస్తున్న వైనం

అంతుబట్టని తెగులు చీనీ రైతులను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఎంతో కష్టపడి పెంచి పోషించుకున్న చెట్లు కళ్లముందే నిలువునా ఎండుతున్నాయి. మంచి దిగుబడులు ఇస్తాయనుకున్న సమయంలో చెట్లు నాశనమైపోవడం చూసి రైతన్నలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. మిగిలిన చెట్లను కాపాడుకునేందుకు రైతులు పడరానిపాట్లు పడుతున్నారు.

పులివెందుల, ఏప్రిల్ 1: పులివెందుల నియోజకవర్గం చీనీ పంటకు పెట్టింది పేరు. దాదాపు 25వేల ఎకరాల్లో చీనీ వివిధ దశల్లో సాగులో ఉంది. 18వేల ఎకరాలలో చీనీ దిగుబడులు అందిస్తున్న తోటలే ఉన్నాయి. గత రెండేళ్లుగా ఈ తోటలకు మాయదారి రోగం పట్టుకుంది. దీంతో వేల ఎకరాల్లో చీనీచెట్లు నిలువునా ఎండిపోతున్నాయి. చీనీ చెట్లు మొదళ్లలో బంక కారుతూ చెట్టుకు ఉన్న తాట అంతా పొలుసులాగా మారి కాయలతో ఉన్న చీనీచెట్లే ఎండిపోతున్నాయి. డిసెంబరు నుంచి ఈ తెగులు ఉధృతి అధికంగా ఉంది. ఏం చేయాలో అంతుబట్టని పరిస్థితి.

ఐదేళ్లపాటు పోషించాల్సిందే...

చీనీ తోటలు సాగుచేయాలంటే అంటు నాటినప్పటి నుంచి డ్రిప్పు ఏర్పాటు చేసుకునే వరకు ఎకరాకు దాదాపు రూ.40వేల నుంచి రూ.50వేలు ఖర్చు అవుతుంది. అంటు నాటినప్పటి నుంచి ఐదేళ్ల పాటు కన్నబిడ్డల్లాగా చూసుకోవాల్సి ఉంటుంది. దాదాపు చెట్టుకు 20 ఏళ్లు వచ్చే వరకు దిగుబడులు వస్తాయి. అంటే ఎలాంటి దిగుబడి లేకపోయిన ఐదేళ్ల పాటు చెట్లను పోషించాల్సిందే.



తెగులు కారణంగా కాయలతోనే నిలువునా ఎండిన చీనీ చెట్టు

చెట్లను కాపాడుకునేందుకు.....

తెగులు సోకిన చెట్లను కాపాడుకునేందుకు రైతులు మందుల పిచికారీకి లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఎకరం చీనీ తోటకు దాదాపు 500 లీటర్ల మందును పిచికారీ చేయాల్సి ఉంటుంది. దీనికి దాదాపు రూ.25వేలు ఖర్చుచేస్తున్నారు. అయినప్పటికీ తెగులు నుంచి చెట్లను కాపాడుకోలేకపోతున్నారు. ప్రస్తుతం 12 నుంచి 15 ఏళ్ల వయసున్న చీనీతోటలు ఎండుతున్నాయి. తెగులుతో ఎండిపోతున్న చీనీ తోటలన్నీ కూడా ప్రస్తుతం దిగుబడులు వస్తున్నవే. మంచి దిగుబడులు వచ్చే సమయంలో ఇలా తోటలు ఎండిపోవడం రైతులను అటు మానసికంగా ఇటు ఆర్థికంగా పూర్తిగా కుంగదీస్తోందనే చెప్పాలి.

వేల ఎకరాల్లో ఎండిపోతున్నాయి..

అంతుబట్టని తెగులుతో వేల ఎకరాల్లో చీనీచెట్లు ఎండిపోతున్నాయి. ఒక ఎకరం చీనీ తోటలో ఏడాదికి ఒకటి నుంచి ఐదు చెట్ల వరకు పలు రకాల తెగుళ్లతో చనిపోవడం సర్వసాధారణం. కానీ ఈ ఏడాది డిసెంబరు నుంచి ఎకరం తోటలో ఇప్పటికే సగభాగం చెట్లు చనిపోతున్నాయని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఐదు ఎకరాలు ఉన్న పది ఎకరాలు ఉన్న తోటలు సైతం దాదాపు వంద నుంచి 200 చెట్ల వరకు బంక కారడం, మొదలుకు పెలుసు పెలుసుగా తాట లేచిపోవడం, కాయలు ఉన్న చెట్లే ఎండిపోవడం జరుగుతోంది.

చేతులెత్తేసిన ఉద్యాన శాఖ

తెగుళ్ల సోకి చీనీ చెట్లు నిలువునా ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్నా ఉద్యానశాఖ అధికారుల నుంచి సరైన సహకారం లేదని రైతులు చెబుతున్నారు. తోటల్లో చీనీ చెట్లు ఎండిపోతున్నాయని, ఏమి చేయాలని వారి దృష్టికి తీసుకెళితే.. ఇది వేరుకుళ్లు తెగులు అని, ఈ తెగులును అరికట్టాలంటే ముందుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. కానీ వేరుకుళ్లు తరహా రోగం కాదని, ఇది చెట్టు మొదళ్లలోనే వస్తోందని రైతులు చెబుతున్నారు. ఉద్యానశాఖ అధికారులు చెప్పిన మందులు పిచికారీ చేసిన ప్రయోజనం లేదని రైతులు చెబుతున్నారు.



తెగులు సోకడంతో నిలువునా ఎండిపోయిన చీనీచెట్టు

ఎన్ని మందులు పిచికారీ చేసినా...



చీనీ చెట్లను కాపాడుకునేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసిన ఉపయోగం లేదు. మేము ఐదు ఎకరాల పొలంలో చీనీతోట సాగు చేశాము. చీనీతోట సాగు చేసి 14 ఏళ్లు గడిచింది. ప్రస్తుతం మంచి దిగుబడులు వస్తున్నాయి. కానీ ఈ ఏడాది డిసెంబరు నుంచి చెట్లకు బంక కారి నిలువునా ఎండిపోతున్నాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా చెట్లు మాత్రం చనిపోతూనే ఉన్నాయి. తోటలు పూర్తిగా తీసేసే పరిస్థితులు వస్తాయని భయమేస్తోంది.

-గట్టు శివమ్మ, ఐచ్చయ్యగారిపల్లె, వేముల మండలం.

ప్రణాళికాబద్ధంగా పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, అధికారులు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 1: జిల్లాలో ప్రణాళికాబద్ధంగా పోస్టల్ బ్యాలెట్ నిర్వహణకు కార్యాచరణ రూపొందించుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్‌మీనాకు వివరించారు. సోమవారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయం నుంచి పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌కు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు, అధికారుల బాధ్యతలు, వారు నిర్వహించాల్సిన విధులపై రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్‌మీనా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో పారదర్శకంగా పోస్టల్ బ్యాలెట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌కు సంబంధించి ఏప్రిల్, మే మాసాల్లో తేదీల వారీగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై తగిన కార్యాచరణను రూపొందించాలని సూచించారు. ఈటీపీబీఎస్ ద్వారా సర్వీస్ ఓటర్ల పోస్టల్ బ్యాలెట్ ప్రింటింగ్, జనరేషన్‌ను పకడ్బందీగా చేయాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే పీవో, ఏపీవో, ఓపీఈవో, మైక్రో అబ్జర్వర్లు, పోలీసులు, ఇతర ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాలు కల్పించడం, అందుకు అవసరమైన ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు తదితర అంశాల్లో కట్టుదిట్టంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో సత్యనారాయణరావు, వివిధ జిల్లాల నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ కుంభకోణం బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 1: గ్రూప్-1ఉద్యోగ నియామకాల్లో జరిగిన అక్రమాలపై హైకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతం సవాంగ్, సెక్రటరీ ఆంజనేయులు వారికి అండగా ఉన్న సీఎం జగన్, ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామక్రిష్ణారెడ్డిలపై చర్యలు తీసుకుని కేసు నమోదు చేయాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్, తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జియాబుద్దీన్ డిమాండ్ చేశారు.

సోమవారం కడప నగరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలో 2018 డిసెంబరులో 162 పోస్టులతో గ్రూప్1 నోటిఫికేషన్ విడుదల చేయగా 2019 మేలో పరీక్షలు నిర్వహించారన్నారు. నోటిఫికేషన్‌లో మాన్యువల్ మూల్యాంకనం పద్ధతిలో జరుగుతుందని తెలిసి తారుమారు చేసేందుకు యత్నించి దాదాపు 49వేల ఓఎంఆర్ షీట్లు మార్చి అంగట్లో సరుకులు అమ్మినట్లు వైసీపీ ప్రభుత్వం 162 గ్రూప్1 ఉద్యోగాలను కోట్ల రూపాయలకు అమ్ముకుందని మండిపడ్డారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీఎన్ఎస్ఎఫ్ నాయకులు లోకేశ్, విశ్వనాథ్, మహేశ్, శ్రీను, తెలుగుయువత నాయకులు చక్రి, వత్స, విజయ పాల్గొన్నారు.

పింఛనుదారులను ఇబ్బంది పెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకే వైసీపీ కుట్ర

● మాజీ ఎమ్మెల్సీ రామచంద్రయ్య

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 1 : రాష్ట్రంలో ఎన్నికలను సజావుగా నిర్వహించడం ఎన్నికల కమిషన్ బాధ్యత. అధికార పార్టీ వైసీపీ సామాజిక పింఛనుదారులను వలంటీర్ల ద్వారా ప్రలోభపెడుతున్న వైనం తమకందిన ఫిర్యాదుల ద్వారా పరిశీలించి... నిజం ఉందని నిరూపణ కావడంతో ఎన్నికల కోడ్ ముగిసే వరకు సామాజిక పింఛన్లను వలంటీర్ల ద్వారా పంపిణీ చేయరాదని ఆదేశాలు ఇచ్చినట్లు మాజీ ఎమ్మెల్సీ రామచంద్రయ్య ప్రకటనలో తెలిపారు. అయితే ఎన్నికల కమిషన్ తీసుకున్న ఈ సహేతుక నిర్ణయాన్ని అందరూ హర్షిస్తుంటే.. వైసీపీ మాత్రం గగ్గోలు పెడుతోందన్నారు. తమ కుట్ర ఫలించలేదన్న అక్కసు ఆ పార్టీ నేతల్లో కనిపిస్తుందని వాపోయారు.

ఎన్నికల సమయంలో వలంటీర్లపై వత్తిడి పెంచి తమకు అనుకూలంగా వైసీపీ అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారన్న వార్తలు మీడియాలో వచ్చాయన్నారు. అలాగే అధికార పార్టీ అభ్యర్థుల ప్రచారంలో కొందరు వలంటీర్లు పాల్గొన్న ఫొటోలు, వీడియోలు బయటికి వచ్చాయన్నా రు. దీనిపై సిటిజన్ ఫర్ డెమెక్రసీ సంస్థ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిందన్నారు. వైసీపీ ఆరోపణలు చేస్తున్నట్లు ఈ సంస్థ తెలుగుదేశం పార్టీకి అనుబంధానమైనదని కాదన్నారు. ఇందులో తటస్థులైన మేధావులు ఉన్నారని, వారికి రాజకీయ దురుద్దేశ్యాలు ఆపాదించడం వైసీపీ కుసంస్కారం తప్ప మరొకటి కాదని స్పష్టం చేశారు.

నవోదయ ప్రవేశ పరీక్షా ఫలితాలు విడుదల

రాజంపేట టౌన్, మార్చి 1: రాజంపేట మండలం నారమరాజుపల్లెలో గల జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికి విద్యార్థులు రాసిన పరీక్షా ఫలితాలు సోమవారం విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం.గీత ఒక ప్రకటనలో తెలియజేశారు.

2024 జనవరి 20వ తేదీ విద్యార్థులు పరీక్షలు రాయడం జరిగిందని, అందుకు సంబంధించిన ఫలితాలు హెచ్‌టీటీపీఎస్:// డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. నవోదయ.జీవోవి.ఇన్/ఎన్‌విఎస్/ఎన్‌విఎస్-స్కూల్/కడప/ఈఎన్/హోమ్/ వెబ్‌సైట్‌లో రోల్ నెంబరు వారీగా పొందుపరచడం జరిగిందని.. విద్యార్థులు పరిశీలించుకోవాలన్నారు. విద్యార్థులు సమర్పించే సర్టిఫికెట్లు సరైనవా కాదా.. అని నిర్ధారించిన తరువాత ప్రవేశం కల్పిస్తామని, అంత వరకు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు తీసుకురావాలని తెలియజేశారు.

సమస్యలు 'ప్లస్'



బద్వేలులో వసతులు లేకపోయినా టెన్త్ ప్లస్ నిర్వహిస్తున్న ఉన్నత పాఠశాల

● ఉన్నత పాఠశాలల్లో హైస్కూల్ ప్లస్ అట.. ● ఉన్న వాటికే వసతులు లేవు

● తరగతి గదులు ల్యాబ్‌లకు దిక్కులేదు ● మరో 18 జూనియర్ కళాశాలలు (హైస్కూల్ ప్లస్)

● ఈ ఏడాది జూన్ నుంచి ప్రారంభానికి సన్నాహాలు

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 1: వచ్చే విద్యాసంవత్సరం నుంచి జిల్లాలో కొత్తగా 18 ఉన్నత పాఠశాలల్లో జూనియర్ కళాశాలలు (హైస్కూల్ ప్లస్) ప్రారంభించనున్నారు. 18 చోట్ల కోఎడ్యుకేషన్ (బాలురు, బాలికలు)కు ఇంటర్ తరగతులు బోధించనున్నారు. ఈ మేరకు తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాల విద్య పూర్తిచేసుకున్న విద్యార్థులకు మాధ్యమిక విద్యనందించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ప్రతి మండలంలో బాలికలకు 1, బాలబాలికలకు కలిపి ఒక జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా 2022-23 విద్యాసంవత్సరం నుంచి హైస్కూలు ప్లస్ పేరుతో ఉన్నత పాఠశాలల్లో ఇంటర్ విద్యను ప్రవేశపెట్టారు. జిల్లాలో ఇలా 13 పాఠశాలల్లో ప్రారంభించినప్పటికీ పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. ఇక 2024-25 విద్యాసంవత్సరం నుంచి కోఎడ్యుకేషన్ హైస్కూలు ప్లస్ ఏర్పాటుకు ఉత్తర్వులు విడుదలయ్యాయి. దీనికిగాను జిల్లాలో 18 మండలాల్లో ఈ జూనియర్ కళాశాలలు ప్రారంభం కానున్నాయి. ఉన్నవాటికే దిక్కు లేదంటే.. మరో 18 వాటిని ప్రారంభిస్తే ఎలా అని విద్యాశాఖ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

వెంటాడుతున్న సమస్యలు

ఉన్నత పాఠశాలల్లో జూనియర్ కళాశాలలను ప్రారంభించాలంటూ ఉత్తర్వులు జారీ చేసినా.. ఆ మేరకు వసతులు లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. ప్రధానంగా సిబ్బంది నియామకం నుంచి నిర్వహణ వరకు అన్నీ సమస్యలే. హైస్కూలు ప్లస్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఇంటర్మీడియట్ విద్య నిర్వహణ కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. వీటికి ప్రత్యేకమైన భవన నిర్మాణాలు, ఆటస్థలాలు, ల్యాబ్‌లు శాశ్వత ప్రాతిపదికన బోధన, బోధనేతర సిబ్బందిని ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. చివరికి వ్యాయామ ఉపాధ్యాయుడు లేకుండా తూతూమంత్రంగా హైస్కూలు ప్లస్ ప్రారంభించారు. అందుకే వీటిల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడంలేదు. ఆశించిన రీతిలో ప్రవేశాలు జరగడంలేదు.

అలంకారప్రాయంగానే..

ఇంటర్మీడియట్ విభాగం సూచనల మేరకు బోధనా సిబ్బంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు మాత్రమే బోధిస్తే సరైన న్యాయం జరుగుతుందని.. అయితే హైస్కూలు ప్లస్‌లో నియమించిన బోధన సిబ్బంది 9 నుంచి 12తరగతుల వరకు బోధించడం వల్ల సమస్యలు ఏర్పడుతున్నాయని పలువురుచెబుతున్నారు. బోధనా సిబ్బంది నియామకాల్లో సైతం విద్యాశాఖ అలసత్వంతో అలంకార ప్రాయంగానే హైస్కూలు ప్లస్ కొనసాగుతున్నాయి. అరకొర విద్యార్థులు చేరినా వారికి శాస్త్రీయ అభ్యసన నిమిత్తం ల్యాబ్ సౌకర్యం లేదు. దీంతో దగ్గరలో ఉన్న మోడల్ స్కూలులోని జూనియర్ కళాశాలలకు వెళ్లి ప్రయోగాలు అభ్యసనం చేయాలని విద్యాశాఖ ఆదేశించడం పట్ల విద్యార్థులు దాదాపు పదికిలోమీటర్ల పైబడ్డ దూరంలో ఉన్న కళాశాలలకు వెళ్లి అభ్యసించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జిల్లాలో చెన్నూరు హైస్కూలు ప్లస్‌లో విద్యార్థులు ఖాజీపేటలోని మోడల్ స్కూలుకు పది కి.మీ మేర ప్రయాణించి ప్రాక్టీసు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. జిల్లాలో అన్ని హైస్కూలు ప్లస్‌ల పరిస్థితి ఇలానే ఉందని తెలుస్తోంది. దీంతో పాటు బోధనా సిబ్బందికి చెల్లిస్తామన్న వేతన ఇంక్రిమెంట్లు దానికి సంబంధించిన బకాయిలు తమ అకౌంటులో ఎప్పుడు పడతాయోనని ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. ఇలా పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే 2024-25 విద్యాసంవత్సరం నుంచి ఎటువంటి ప్రణాళికలు లేకుండా కోఎడ్యుకేషన్ హైస్కూలు ప్లస్‌లు ప్రారంభిస్తామని విద్యాశాఖ ప్రకటన చేయడం పట్ల పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైస్కూలు ప్లస్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు పరచకపోవడం కొసమెరుపు.

ముందు సౌకర్యాలు కల్పించాలి..



శాశ్వత ప్రాతిపదికన బోధన సిబ్బందిని నియమించాలి. బోధనా సిబ్బంది ఇంక్రిమెంట్లను మూల వేతనంలో శాశ్వత ప్రాతిపదికన కలపాలి. అధికారికంగా ఇంటర్మీడియట్ ప్లస్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం కల్పించాలి. సమపాళ్లలో సైన్స్, నాన్ సైన్స్ కోర్సులను హైస్కూలు ప్లస్‌లో చేర్చాలి. అన్ని సౌకర్యాలు కల్పించిన తరువాత హైస్కూలు ప్లస్ కోఎడ్యుకేషన్ కోర్సులను ప్రారంభించాలి.

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్, అమరావతి ఆర్గనైజింగ్ సెక్రటరీ



పదోన్నతులు కల్పించాలి..



కో ఎడ్యుకేషన్ కింద మంజూరైన హైస్కూలు ప్లస్‌లో వేసవి సెలవుల్లో పదోన్నతులు చేపట్టాలి. శాశ్వత ప్రాతిపదికన పీజీటీలుగా పదోన్నతులు ఇవ్వాలి. విద్యాసంవత్సరం ప్రారంభంలో బోధనా సిబ్బంది కొరత లేకుండా చూడాలి. ఉర్దూ మీడియం, హైస్కూలు ప్లస్‌లు కూడా జిల్లాలో నాలుగుచోట్ల ఏర్పాటు చేయాలి. హైస్కూలు ప్లస్‌లో ఉన్న లోటుపాట్లను తక్షణం సరిదిద్దాలి.

- ఎస్.అబ్దుల్ గఫార్, స్కూలు అసిస్టెంటు, ఇంగ్లీషు

అధిష్ఠాన నిర్ణయమే శిరోధార్యం

● చమర్తి జగన్‌మోహన్‌రాజు



సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

వీరబల్లి, ఏప్రిల్ 1: టీడీపీ అధిష్ఠానం నిర్ణయమే మనకు శిరోధార్యమని టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. తమకు టికెట్ రాకపోయినా అధిష్ఠానం నిర్ణయించిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించుకుందామని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ సందర్భంగా సోమవారం వీరబల్లి టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ ఎన్నికల సన్నాహక ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకు ఎమ్మెల్యే టికెట్ రావాలని ఐదు సంవత్సరాలుగా నిరంతరం తనతో పాటు పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రెడ్డెప్పరెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, అంజనేయరెడ్డి, జయచంద్రారెడ్డి, మట్లి సర్పంచ్ నాగార్జునచారి, మాజీ సర్పంచ్ వెంకట్రమణ, మైనార్టీ నాయకులు కాలేశా, బీసీ నాయకులు దుర్గం అంజనేయులు, సుధాకర్‌రాజు, భాస్కర్‌రాజు, టీడీపీ మహిళా అధ్యక్షురాలు నాగసుబ్బమ్మ, రమేశ్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేనలోకి ముక్కావారిపల్లె సర్పంచ్




జనసేనలో చేరిన శ్రీధర్

రైల్వేకోడూరు, ఏప్రిల్ 1: నియోజకవర్గంలోని ఓబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లె సర్పంచ్ అరవ శ్రీధర్ పిఠాపురంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సమక్షంలో సోమవారం టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌ఛార్జ్ రూపానందరెడ్డి సహకారంతో పార్టీలో చేరారు. అరవ శ్రీధర్‌ను పవన్‌కళ్యాణ్ సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువా కప్పారు. ఈ సందర్భంగా ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ జనసేన పార్టీ కోసం అహర్నిశలు పనిచేస్తామన్నారు. పార్టీని బలోపేతం చేస్తామని, వచ్చే ఎన్నికల్లో జనసేన కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి పొత్తుతో వైసీపీ పతనం ఖాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, రాయలసీమ జోన్ ఇన్‌చార్జులు పగడాల వెంకటేష్, జోగినేని మణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు





హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం, (ఇన్‌సెట్‌లో) ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 1: పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలో వెలిసియున్న షిరిడీ సాయినాథుని 24వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షిరిడీ సేవా సమితి ఆధ్వర్యంలో బెంగుళూరు వాసవి వేద పాఠశాల ముఖ్య అధ్యాపకులు నరేంద్ర స్వామి నేతృత్వంలో మహాగణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, నవగ్రహ పూజలు, కలశ స్థాపన, సాయినాథుని హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం 11.30 గంటలకు మహాపూర్ణాహుతి, 12.30 గంటలకు పూర్ణ కుంభాభిషేకం, మధ్యాహ్నం ఆలయానికి వచ్చిన భక్తుల సౌకర్యార్థం అన్నదానం చేపట్టారు. అలాగే 1.30 గంటలకు మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి మహా మంగళహారతి అనంతరం షిరిడీ సాయినాథుని పల్లకీ ఉత్సవం, చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు చుట్టుప్రక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించి పల్లకీ ఉత్సవాన్ని తిలకించారు.

సుగవాసి సోదరులను కలిసిన టీడీపీ నేతలు



సుగవాసి సుబ్రమణ్యంకు మద్దతు తెలుపుతున్న మంగళపల్లి టీడీపీ నేతలు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 1: రాజంపేట అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి సుగవాసి బాల సుబ్రమణ్యం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబులను సోమవారం వీరబల్లి మండల వాసులు వేర్వేరుగా కలిశారు. పెద్దివీడు మంగళపల్లెకు చెందిన టీడీపీ నాయకులు, యువకులు తొగట నరసింహులు, రాగన్నగారి నరసింహులు, లక్ష్మయ్య, గోపి, నల్లన్నగారి కిశోర్, ఆంజనేయులు, తొగట వెంకట్రమణ, నగేశ్, మట్లి నాగముని, బండి రమేశ్ తదితరులు కలిసి శాలువాలు, పూలమాలతో సుగవాసి సోదరులను సత్కరించి తమ సంపూర్ణ మద్దతును తెలియజేశారు.

ఆదరిస్తే అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

● మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



జయహో బీసీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మండిపల్లి

రామాపురం, ఏప్రిల్ 1: టీడీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి తమను ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని హసనాపురం పంచాయతీలోని శివాలయంలో సోమవారం మొదటిగా ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ప్రచారం నిర్వహించారు. వసంతవాండ్లపల్లె, చీకటివాండ్లపల్లె, యర్రంగివాండ్లపల్లె, హరిజనవాడ, హసానపురం, పప్పిరెడ్డిగారిపల్లె, గొల్లపల్లె గ్రామాల్లో సోమవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ఆయనకు పూలమాలలతో ఘనస్వాగతం పలికారు. గొల్లపల్లెలో టీడీపీ నాయకులు పప్పిరెడ్డి హరినాథ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, ఉపసర్పంచ్ ఇరగంరెడ్డిల ఆధ్వర్యంలో ఆయనకు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన గొల్లపల్లి టీడీపీ నాయకులు పప్పిరెడ్డి హరినాథ్‌రెడ్డి స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హసనాపురం పెద్దచెరువు ఆయకట్టు 1500 ఎకరాలు ఉండగా ప్రస్తుతం ఒక చుక్క నీరు లేదన్నారు. వెలిగల్లు నీటిని తమ స్వగృహంలోనే తన చెరువు తప్ప మిగిలిన ఏ చెరువుకు నీళ్లు అందలేదన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి వెలిగల్లు కుడికాలువ, ఎడమకాలువ పనులు నాశిరకంగా పనులు చేయడంతోనే నియోకవర్గంలోని ఏ చెరువుకు నీనే అందించలేదన్నారు. 15 సంవత్సరాలుగా రాయచోటి ఎమ్మెల్యేగా ఉన్నా ఎక్కడ అభివృద్ధి జరగలేదన్నారు.

హసనాపురంలో 200 కుటుంబాలు చేరిక

మండలంలోని హసనాపురం గ్రామంలో రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా మాజీ జడ్పీటీసీ నాగసుబ్బారెడ్డి, హరినాథ్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఆ గ్రామ ఉపసర్పంచ్ ఇరగంరెడ్డితో పాటు చీకటివాండ్లపల్లె, పప్పిరెడ్డిగారిపల్లె, గొల్లపల్లి, హసనాపురం గ్రామాల్లో వైసీపీ నుంచి 200 కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, చంద్రమౌళి, టీడీపీ నాయకులు పప్పిరెడ్డి హరినాథ్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, గంగన్ననాయుడు, రమేశ్ నాయుడు, నరసింహారెడ్డి, రామాంజనేయరెడ్డి, అల్లాబకాష్, పెంచల్‌రెడ్డి, ద్వారకనాథ రెడ్డి, రమేశ్‌రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, గంగిరెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే బీసీల అభివృద్ధి

గాలివీడు, ఏప్రిల్ 1: టీడీపీ ప్రభుత్వ హయాంలోని బీసీలకు న్యాయం జరగడంతో పాటు అభివృద్ధి చెందారని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన మంగళవారం మండల కేంద్రంలో జయహో బీసీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీల అభ్యున్నతి కోసం పాటు పడడంతో పాటు సామాజికంగా, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సముచిత స్థానం కల్పించారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ శాతాన్ని తగ్గించి వారి రాజకీయ ఎదుగుదలకు అడ్డుపడుతున్నారని విమర్శించారు. మండలంలో వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న బీసీ కుటుంబాలు ఎక్కువగా నివసిస్తున్నారని, పార్టీ అధికారంలోకి రాగానే వారందరికీ సాగు, తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రంగనాయకస్వామికి ప్రత్యేక పూజలు



భక్తులు దర్శనభాగం ప్రదర్శించిన బ్రహ్మంగారి కాలజ్ఞాన పాదకులు

చిట్వేలి, ఏప్రిల్ 1: మండల పరిధిలోని రంగనాయకులస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఐదవ రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు రంగనాయకుల స్వామి అగ్ని సమాధి వహించిన రోజు కావడంతో బ్రహ్మంగారు రచించిన అత్యుత్తమ పవిత్రమైన తాళ్లపాక గ్రంథాలు, అక్కడ ఆవిర్భవించిన స్వామివారి పాదుకలు, యోగదండం, రుద్రాక్ష మాల, అడ్డఖడ్గము, బేరి కోమటి, తక్కెడ పుల్లలు భక్తుల దర్శనార్థం ప్రదర్శించారు. ఫల్గుణ బహుళ సప్తమి రోజున స్వామివారి కార్యక్రమాలు ఎగువపల్లి గ్రామస్తులు నరసయ్యనాయుడు కుటుంబ సభ్యులచే మధ్యాహ్నం, రాత్రి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి పౌరాణిక నాటక ప్రదర్శనను నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

కస్తూరి విశ్వనాథనాయుడుకు ఘన స్వాగతం

జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన చిట్వేలి మండలం నగిరిపాడు రంగనాయకస్వామి ఆలయంలో టీడీపీ నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త కస్తూరి విశ్వనాథనాయుడుకు ఘన స్వాగతం పలికారు. సోమవారం రాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయాన్ని సందర్శించిన ఆయనకు ఆలయ కమిటీ ఛైర్మన్ నాగేశ్వరనాయుడు, ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్యనాయుడు, ఉపాధ్యక్షుడు శంకరయ్యయాదవ్, ప్రధాన కార్యదర్శి ఆర్.నరసరామయ్య ఆధ్వర్యంలో పూలమాల వేసి సత్కరించారు. ఈ సందర్భంగా కస్తూరి విశ్వనాధనాయుడుతో పాటు పారిశ్రామిక వేత్త విశ్వేశ్వరనాయుడులను సత్కరించారు.

గ్రామాల్లో నీటి పరిష్కారం చూపించాలి : పీడీ



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధి పీడీ

రామాపురం,ఏప్రిల్ 1: మండల పరిధిలో నీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి ఆ గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ ఎంసీ మద్దిలేటి అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ భవనంలో ఆయాశాఖల అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. వేసవి కాలం వచ్చిన దృష్ట్యా గ్రామాల్లో ఎక్కడా నీటి సమస్య లేకుండా చూడడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఉపాధి హామీకి సంబంధించిన అధికారులు నీటి పారుదలశాఖకు సంబంధించిన అధికారులు సమన్వయంతో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ ఏపీవో సురేంద్రనాథ్ రెడ్డి, నీటి పారుదలశాఖ అధికారులు పాల్గొన్నారు.

కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసిన టీడీపీ నాయకులు



కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసిన మండల టీడీపీ నేతలు

సంబేపల్లె, ఏప్రిల్ 1: మాజీ ముఖ్యమంత్రి, రాజంపేట పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిని మండల టీడీపీ నాయకులు గోపీనాథ్‌రెడ్డి, టీడీపీ రాజంపేట పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి సుబ్బరాజుయాదవ్, దేవపట్ల టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాయచోటి నియోజకవర్గంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ఆయనతో మాట్లాడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ మైనార్టీలకు వ్యతిరేక పార్టీ కాదని ఏనాడు వారికి హాని చేయలేదని తెలియజేసినట్లు తెలిపారు. రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రాయచోటిలో ఈసారి టీడీపీని గెలిపించేందుకు ప్రతిఒక్కరూ పనిచేయాలని తెలియజేశారు. మైనార్టీలు అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో మైనార్టీల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలియజేశారు. వైసీపీ ఓటమికి ప్రతి కార్యకర్తలు యుద్ధ సైనికుల్లా పనిచేయాలని తెలియజేశారు. నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు.

సచివాలయ ఉద్యోగులకు జీతాలు చెల్లించండి

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 1: మండలంలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించాలని సచివాలయ ఉద్యోగులు సోమవారం ఎంపీడీఓ వెంకటరామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ ప్రతి నెల సకాలంలో జీతాలు రావడం లేదని డీడీఓ సకాలంలో బిల్లులు పెట్టలేదా లేక ప్రభుత్వం తమకు జీతాలు పంపడం లేదా అని ఎంపీడీఓను అడిగారు. ఫిబ్రవరి నెలలో కూడా ఆలస్యంగా జీతాలు వచ్చాయన్నారు. కస్తూరిరాజుగారిపల్లె సచివాలయం సిబ్బంది పరిస్థితి చాలా అధ్వానంగా ఉందని, ఒక నెల కూడా సకాలంలో జీతాలు వచ్చిన దాఖలాలు లేవన్నారు. స్పందించిన ఎంపీడీఓ ఇప్పటి నుంచి ప్రతి నెల జీతాలు సకాలంలో వచ్చేలా చేస్తామని ఆయన సచివాలయ సిబ్బందికి సూచించారు.



ఎంపీడీఓతో మాట్లాడుతున్న కస్తూరివారిపల్లె సచివాలయ సిబ్బంది

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

● ఎంపీడీవో భాను ప్రసాద్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 1: మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో భాను ప్రసాద్ ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లుతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రస్తుతం నాలుగు గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించామన్నారు. బోర్లలో నీటి శాతం ఇంకిపోయే అవకాశం వున్న చోట్ల ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది సహకారంతో సామాజిక పింఛన్ల పంపిణీపై దృష్టి పెట్టాలన్నారు. దీంతో పాటు ఎన్నికల కోడ్ అమలులో ఎక్కడ కూడా రాజీపడకూడదని, ఇలాంటి సంఘటనలు బయటపడిన వెంటనే ఉన్నతాధికారులకు నివేదికలు పంపాలన్నారు. రద్దీ కూడలి ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చందన, ఈవోఆర్డీ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఈసీ నిబంధన ఉల్లంఘన



సచివాలయం పరిధిలో ఉన్న బోర్డు

సిద్దవటం, ఏప్రిల్ 1: మండలంలోని జ్యోతి గ్రామ సచివాలయ పరిధిలో ఎలక్షన్ కోడ్ అమల్లో ఉండగా సీఎం జగన్ వాల్‌పోస్టర్లు బహిరంగంగా దర్శనమిస్తున్నాయి. పి.కొత్తపల్లి గ్రామంలో కొన్ని గృహాల గోడలకు ఇవి కనిపించాయి. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీటిని తొలగించాలని పేర్కొన్నారు.

కేంద్ర బలగాలతో వాహనాల తనిఖీ

నందలూరు, ఏప్రిల్ 1: కడప-చెన్నై ప్రధాన రహదారిలోని నందలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో సోమవారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాముడు, పోలీసులు మహేంద్ర, కేంద్ర బలగాల పోలీసులు పాల్గొన్నారు.

కాపు నాయకులను కలసిన భాస్కర్‌రావు



భాస్కర్‌రావును సత్కరించిన కాపు నాయకులు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 1: మండలంలోని రాఘవరాజపురంకు చెందిన కాపు నాయకులు ముద్దపోలు మణి, ముద్దపోలు సభాపతి, బలిజసేన అధ్యక్షులు సుంకర రవిలను సోమవారం జనసేన అభ్యర్థి డాక్టర్ యనమల భాస్కర్‌రావు కలిసి చర్చలు జరిపారు. తనకు పూర్తి మద్దతు కావాలని వారిని కోరారు. రైల్వేకోడూరు మండలంలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. భాస్కర్‌రావును కాపు నాయకులు ఘనంగా సత్కరించారు.

నేడు కళాశాల వార్షికోత్సవం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 1: మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన యూనివర్శిటీ లో 14వ వార్షికోత్సవ కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ కే.గోపాల్ సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ టి.జానకిరాం, విశ్వవిద్యాలయం డీఎస్ పద్మావతమ్మ, పతంజలి ఫుడ్స్ కంపెనీ డిప్యూటి జనరల్ మేనేజర్ డి.రవీంద్ర హజరౌతున్నారని తెలిపారు.

నవోదయ విద్యార్థి ఎంపిక

● విద్యార్థిని అభినందించిన ఎంఈఓ

సుండుపల్లె, ఏప్రిల్ 1: మండలంలోని పెద్దినేనికాలువ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థి యక్షిత్‌నాయక్ రాజంపేట నవోదయ పాఠశాలకు ఎంపికైనట్లు ఎంఈఓ రవీంద్రనాయక్ తెలిపారు. సోమవారం విద్యార్థిని ఆ పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని తెలియజేశారు. విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాల్లో ఎదగాలని తెలియజేశారు. అనంతరం నవోదయకు ఎంపికైన విద్యార్థికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

ప్రణాళికాబద్ధంగా వైసీపీని ఓడిస్తాం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 1: ప్రణాళికాబద్ధంగా రైల్వేకోడూరులో వైసీపీని ఓడిస్తామని టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో వినూత్నంగా ప్రచారాలు ఉంటాయని, అందరినీ కలుపుకుని విజయం సాధిస్తామన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి పొత్తుతో వైసీపీని చిత్తు, చిత్తుగా ఓడిస్తామని తెలిపారు. కాగా టీడీపీ అధికారంలోకి రాగానే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఏర్పాటు చేయిస్తామన్నారు.

నేడు, రేపు వైభవంగా గంగ జాతర

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 1: మండలంలోని పలు గ్రామాల్లో మంగళ, బుధవారాల్లో గంగజాతరలు జరుగనున్నాయి. మండల కేంద్రమైన పీటీఎంలో గంగ జాతరకు భారీ ఏర్పాట్లను చేశారు. ముందుగా మంగళవారం ఉదయం నుంచి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం అమ్మవారికి మహిళలు జ్యోతులు మోసి మొక్కులు తీర్చుకుంటారు. అనంతరం జంతు బలినిచ్చి మొక్కులు తీర్చుకుంటారు.

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 1: మదనపల్లె మండలం సీటీఎం గ్రామం వద్ద రైలు కింద పడి ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. కదిరి రైల్వే ఎస్ఐ రహీం కథనం మేరకు.. తిరుపతి నుంచి ధర్మవరం వైపు వెళుతున్న రైలు సీటీఎం ఆంజనేయస్వామి ఆలయం వద్దకు రాగానే అక్కడే వున్న ఓ మహిళ(34) హఠాత్తుగా రైలు కింద పడిపోయి అక్కడిక్కడే మృతి చెందిందన్నారు. స్థానికులు గమనించి రైల్వే అధికారులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకుని మృతురాలి వివరాలు సేకరిస్తున్నామని రైల్వే ఎస్ఐ తెలిపారు.

గోశాలకు పశుగ్రాసం వితరణ

తంబళ్లపల్లె, ఏప్రిల్ 1: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండ గోశాలకు తంబళ్లపల్లె నాగేంద్రవీధికి చెందిన సతీష్ మూడు ట్రాక్టర్ లోడ్ల పశుగ్రాసాన్ని (ఎండు మొక్కజొన్న కర్రలు) వితరణగా ఇచ్చి మూగ జీవాల పట్ల ప్రేమను చాటుకున్నాడు. సోమవారం దాత అందచేసిన పశుగ్రాసాన్ని స్థానికులు మెడికల్ స్టోర్ నారాయణరెడ్డి, సహదేవ, రామ్మూర్తి, శ్రీనివాసులు మల్లయ్యకొండ పైన ఉన్న గోశాలకు వద్దకు చేర్చి సిబ్బందికి అందచేశారు. సతీష్ దాతృత్వం పట్ల ఆలయ సిబ్బందితో పాటు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాదిగలకు న్యాయం చేయాలి : ఎంఎస్పీ

● ఎంఎస్పీ జాతీయ నాయకుడు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 1: జనసేనకు కేటాయించిన ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో రెండింటిని మాదిగలకు కేటాయించి న్యాయం చేయాలని ఎంఎస్‌పీ (ఎంఆర్‌పీఎస్) జాతీయ నాయకులు ఎస్.సురేంద్రబాబు మాదిగ డిమాండు చేశారు. సోమవారం రైల్వేకోడూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ భాగస్వామ్యంలో పి.గన్నవరం, రైల్వేకోడూరు స్థానాలను మాదిగ సామాజిక వర్గానికి సీట్లు కేటాయించాలని తెలిపారు. ఎన్‌డీఏ కూటమిలోని బీజేపీ కేంద్రంలోను, రాష్ట్రంలో టీడీపీకి రాజకీయంగా, ఆర్థికంగా, సంక్షేమ పరంగా సంపూర్ణంగా మాదిగలకు అండగా నిలిచాయని తెలిపారు. ఇప్పటికే ఎస్సీ స్థానాల్లో ప్రకటించిన అభ్యర్థుల విషయంలో పునరాలోచన చేసి మాదిగలకు కేటాయించకపోతే భవిష్యత్‌లో సామాజిక న్యాయ నినాదాన్ని పవన్‌కళ్యాణ్ నినదించే నైతిక అర్హతను కోల్పోతారని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎంఆర్‌పీఎస్ నాయకులు వెంబడి రాధాక్రిష్ణ, నగరిపాటి చెంగయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి దడ్డు రామక్రిష్ణ, జాతీయ నాయకులు శివయ్య, జిల్లా అధ్యక్షులు రవీంద్ర, రాష్ట్ర కార్యదర్శి దుమ్ము చిన్నా, జిల్లా నాయకులు మంద శివయ్య, స్థానిక నాయకులు సంటి శేఖర్, యానాదయ్య, జనార్ధన్, జయరామయ్య, పోలే హరిబాబు, తాడి సిద్ధయ్య, నాగిపోగ పెంచలయ్య, నరసింహులు, గొంటు రాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్మగ్లరు అరెస్టు.. దుంగలు స్వాధీనం

పీలేరు, ఏప్రిల్ 1: ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న ఒక స్మగ్లరును అరెస్టు చేయడంతో పాటు వాహనం 10 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్, పీలేరు డీఎఫ్‌వో జేవీ సుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. సుండుపల్లె అటవీ ప్రాంతం నుంచి పీలేరు మీదుగా చెన్నైకు ఎర్రచందరం అక్రమ రవాణా జరగుతోందన్న సమాచారం మేరకు కలికిరి వైపు నుంచి కందూరు వైపు వేగంగా వచ్చిన కారును అడ్డుకుని తమిళనాడు రాష్ట్రం జమునా ముత్తూరుకు చెందిన తాతన్ అనే వ్యక్తిని పట్టుకున్నామన్నారు. కారును తనిఖీ చేయగా అందులో 345 కేజీలు బరువున్న 10 ఎర్రచందనం దుంగలు లభించాయన్నారు. దీంతో స్మగ్లరు, కారుతో సహా వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడిలో ఎఫ్ఆర్‌వో వెంకటరమణ, ఎఫ్‌బీవో ప్రతాప్, సిబ్బంది చరణ్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో ఆలస్యంపై సత్యవేడు ఎమ్మెల్యే మౌనదీక్ష



టీడీపీ నేతలతో కలిసి మౌనదీక్ష చేస్తున్న ఆదిమూలం

నారాయణవనం, ఏప్రిల్ 1 : సామాజిక పెన్షన్ల పంపిణీలో ఆలస్యంపై నిరసన వ్యక్తం చేస్తూ సోమవారం సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం మౌన దీక్ష చేపట్టారు. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కూడా అయిన ఆదిమూలం నారాయణవనంలో పార్టీ నేతలతో కలిసి సాయంత్రం గంట సేపు దీక్ష చేపట్టారు.నగదు లోటు కారణంగానే పెన్షన్లు పంపిణీ చేయలేదని, అయితే జగన్, వైసీపీ నాయకులు కావాలనే టీడీపీ పైన బురదచల్లే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు.సచివాలయ సిబ్బంది ద్వారా వెంటనే పింఛన్లను లబ్ధిదారుల ఇళ్లకు చేర్చాలని ఆదిమూలం డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు ఆర్టీ ఏకాంబరం, భాస్కరన్, గోవిందస్వామి, శివకుమార్, కేవీస్ రవి, గోవిందశెట్టి, రమేష్, సురేష్, విజయ్‌కుమార్, జయచంద్ర నాయుడు, కందస్వామి నాయుడు, వాసు, మల్లికార్జున రెడ్డి, మాణిక్యం రెడ్డి, రవిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఆ టీచర్లను విధుల్లోకి తీసుకోండి : ఎస్టీయూ



డీఈవోతో చర్చిస్తున్న ఎస్టీయూ సంఘం నేతలు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 1: ఓపెన్ స్కూల్ పరీక్షల విధి నిర్వహణలో సస్పెండైన టీచర్లను విధుల్లోకి తీసుకోవాలని ఎస్టీయూ నాయకులు డీఈవో దేవరాజు, ఏడీ విజయేంద్రరావులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం డీఈవోను ఆయన చాంబర్‌లో ఎస్టీయూ నాయకులు కలిశారు. వారు మాట్లాడుతూ.. గత ఏడాది జవాబు పత్రాల మూల్యాంకనం రెమ్యునరేషన్ బకాయిలు చెల్లించాలని, అనారోగ్య, అనివార్య సమస్యలతో స్పాట్‌కు రాలేని టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. అనంతరం డీఈవో, ఏడీలు ఎస్టీయూ సమాచార స్రవంతి ప్రతులను ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర నేత గంటా మోహన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్‌రెడ్డి, మోహన్, యువరాజు, నాయకులు దేవరాజులు, చంద్రన్, ప్రభుకుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

15మంది వలంటీర్ల రాజీనామా

కల్లూరు/బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 1: పులిచెర్ల మండలం దిగువపోకలవారిపల్లి సచివాలయం పరిధిలోని 10 మంది వలంటీర్లు సోమవారం రాజీనా మా చేసినట్లు పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు. ఈ రాజీనామా పత్రాలను ఎంపీడీవోకు పంపనున్నట్లు పంచాయతీ కార్యదర్శి పేర్కొన్నారు.

● బైరెడ్డిపల్లె మండలంలోని గౌనితిమ్మేపల్లెకు చెందిన ఐదుగురు వలంటీర్లు సోమవారం ఎంపీడీవోకు రాజీనామాపత్రాన్ని అందజేశారు.

కాళంగినదిలో పడి యువకుడి మృతి

తడ, ఏప్రిల్ 1: స్నేహితులతో కలసి నదిలో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు నీట మునిగి మృతి చెందాడు. తిరుపతి జిల్లా తడ మండల పరిధిలోని గ్రద్దగుంట దళితవాడకు చెందిన కుప్పంపాటి వెంకయ్య(28) శుక్రవారం మధ్యాహ్న సమయంలో నలుగురు మత్స్యకారులతో కలసి కాళంగినది వద్దకు వెళ్లాడు.అందరూ కలసి మద్యం సేవించి భోంచేశారు. స్నేహితులు నదిలో వలలు కట్టుకునే పనిలో ఉండగా వెంకయ్య నదిలోకి దిగి నీట మునిగిపోయాడు. స్నేహితులు అది గమనించకుండా వెళ్లిపోయారు. ఆదివారం సాయంత్రం కుటుంబసభ్యులు వెంకయ్య కోసం గాలిస్తుండగా తమతో పాటు వచ్చాడని, ఆ తరువాత కనబడలేదని స్నేహితులు చెప్పారు. దీంతో అందరూ కలసి నదివద్దకు వెళ్లి చూడగా మృతదేహం తేలుతూ కనిపించింది.వెంకయ్య మృతిపై అనుమానాలు ఉన్నట్లు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తహసీల్దార్ శివప్రసాద్ ఆదాయ వనరులపై ఐటీ దృష్టి

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 1 : రేణిగుంట మాజీ తహసీల్దార్ శివప్రసాద్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని అవినీతి నిరోధక శాఖ తనిఖీల్లో బయటపడడంతో ఆదాయ పన్ను శాఖ దృష్టి సారించింది. పన్నుల చెల్లింపునకు సంబంధించి వివరాలు ఆరా తీస్తోంది. తిరుపతి, పీలేరులో ఆయన కూడబెట్టిన ఆస్తులు, భార్య డాక్టర్ కావడంతో ఆమె ఆదాయ వనరులపైనా దృష్టి సారించింది. అధికారిక లెక్కల ప్రకారం రూ.100కు 30 శాతం ఆదాయ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఇలా దాదాపు రూ.70 కోట్లకు రూ.21 కోట్లు ఆదాయ పన్ను చెల్లించాల్సి ఉంది. ఆ మేరకు చెల్లింపులు జరిగాయా లేదా అనేది చూస్తున్నారు.

తప్పిన పెనుప్రమాదం

● రెండో ఘాట్‌లో అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు
● చెట్టును ఢీకొని ఆగడంతో బయటపడిన ప్రయాణికులు



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

తిరుమల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్ రోడ్డులో సోమవారం పెనుప్రమాదం తప్పింది. ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పింది. చెట్టును ఢీకొనడంతో లోయలోకి దూసుకుపోకుండా ప్రమాదం తప్పింది. విజిలెన్స్ అధికారులు వివరాల మేరకు.. ఏపీ 03 జెడ్ 5617 నెంబరు గల ఆర్టీసీ బస్సు 15 ప్రయాణికులతో సోమవారం మధ్యాహ్నం తిరుపతి నుంచి తిరుమలకు బయలుదేరింది. హరిణి ప్రాంతానికి సమీపంలో ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయే క్రమంలో అదుపుతప్పి ఎడమవైపు పిట్టగోడను బలంగా ఢీకొంది. గోడ పగిలిపోవడంతో ముందుకు దూసుకు వెళ్లి చెట్టును ఢీకొని ఆగిపోయింది. బస్సులోని ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. చెట్టు లేకుంటే లోయలోకి దూసుకుపోయి పెద్ద ప్రమాదం జరిగేది. విషయం తెలుసుకున్న పోలీసులు, విజిలెన్స్ అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకుని విచారణ మొదలుపెట్టారు. ప్రమాద నేపథ్యంలో కొంతసేపు వాహనాలు నిలిచిపోయాయి. బస్సును పక్కకు తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు.

రైలు కిందపడి టీచర్ మృతి



కృష్ణప్రసాద్ (ఫైల్ ఫొటో)

గూడూరు, ఏప్రిల్ 1: రైలు దిగుతుండగా కాలుజారి పడి ఓ ఉపాధ్యాయుడు మృతిచెందిన ఘటన తిరుపతి జిల్లా గూడూరు రైల్వేస్టేషన్‌లో సోమవారం చోటుచేసుకుంది. రైల్వే జీఆర్ పోలీసుల కథనం మేరకు... నెల్లూరులోని హరినాథపురంలో నివాసం వుంటున్న కృష్ణప్రసాద్(42) గూడూరు మండలం వెందోడు ప్రాథమికోన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. రోజూ నెల్లూరు నుంచి పాఠశాలకు వచ్చి వెళ్తుంటారు. సోమవారం నెల్లూరు నుంచి బిట్రగుంట - చెన్నై మెమో రైలు లో గూడూరు వచ్చారు. మూడో నంబరు ప్లాట్‌ఫాంపై ఆగేందుకు రైలు నెమ్మదిగా వెళ్తుండగా కృష్ణప్రసాద్ కిందకు దిగబోయాడు. ఆ సమయంలో కాలుజారి రైలు కింద పడడంతో అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. రైల్వే జీఆర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కృష్ణప్రసాద్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

పింఛన్ల పంపిణీపై వైసీపీ దుష్ప్రచారం

మాజీ మంత్రి అమరనాథరెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి

పలమనేరు, ఏప్రిల్ 1: సామాజిక పింఛన్ల పంపిణీపై వైసీపీ దుష్ప్రచారాన్ని మానుకోవాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి సూచించారు. సోమవారం పలమనేరు టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వలంటీర్లు లేకపోతే పింఛన్లు ఇవ్వలేమన్న విధంగా సీఎం జగన్ చెబుతున్నారన్నారు. ఎన్నికల కోడ్ వచ్చాక వలంటీర్లను ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయరనేది అందరికీ తెలుసన్నారు. అందువల్ల ఎన్నికలప్పుడు ఏవిధంగా పింఛన్లు పంపిణీ చేయాలన్న దానిపై కార్యాచరణ చేసుకోకుండా ప్రతిపక్షంపై విమర్శలు చేసే దౌర్భాగ్య పరిస్థితికి జగన్ దిగజారారంటేనే ఓటమిపై ఆయనకు ఎంత భయం పట్టుకుందో అర్థం చేసుకోవచ్చన్నారు. గతంలో సచివాలయ సిబ్బంది లేనప్పుడు కూడా పింఛన్ల పంపిణీ పారదర్శకంగా జరిగిందని గుర్తుచేశారు. ఇపుడు సచివాలయాలతోపాటు ఎంపీడీవో, రెవెన్యూ కార్యాలయాల్లోనూ సిబ్బంది ఉన్నారని, వాళ్ల ద్వారా పింఛన్లు ఇచ్చే ప్రయత్నం చేయకుండా.. ఈ అంశాన్ని కూడా రాజకీయంచేసే నీచపు ఆలోచన వైసీపీ ప్రభుత్వం చేస్తోందని మండిపడ్డారు. 'అసలు పింఛన్ల పంపిణీకి అవసరమైన డబ్బులు మీ వద్ద ఉన్నాయా.. కాంట్రాక్టర్లకు పేమెంట్లు ఇచ్చేసి.. ఈ రకంగా రాజకీయం చేస్తున్నారా' అని అమర్ ప్రశ్నించారు. ఇక వారి సొంత పత్రికలో.. మార్చి కాబట్టి మూడ్రోజులు పెన్షన్ల పంపిణీ ఆలస్యం అవుతుందని ప్రచురించారు.. సోషల్ మీడియాలో మాత్రం ప్రతిపక్షాలపై నెపం వేస్తున్నారని దుయ్యబట్టారు. ఇకనైనా పేదలకు, వృద్ధులకు ఇబ్బంది లేకుండా వెంటనే పింఛన్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఆర్వీ బాలాజి, ఆర్బీసీ కుట్టి, గిరిబాబు, నాగరాజు, ఖాజీపీర్, మదన్‌మోహన్, శ్రీధర్, అస్లాం, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆరణిని గెలిపించి తిరుపతిని బాబుకు కానుకగా ఇస్తాం

● టీడీపీ ఇన్‌ఛార్జి సుగుణమ్మ ప్రకటన - కుటుంబ సభ్యులు, పార్టీ నేతలతో కలిసిన ఆరణి



ఉమ్మడి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు పసుపు కండువాను కప్పుతున్న సుగుణమ్మ

తిరుపతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : "చంద్రబాబు సీఎం కావడమే మా లక్ష్యం. సీఎంగా అసెంబ్లీకి వస్తానని ఆయన శపథం చేశారు. ఆ శపథం నెరవేరేలా పనిచేస్తాం. ఆయన ఆదేశాలకు అనుగుణంగా తిరుపతి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును గెలిపించి చంద్రబాబుకు తిరుపతిని కానుకగా ఇస్తాం." అని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ప్రకటించారు. సోమవారం జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు (జేఎంసీ) తన కుటుంబ సభ్యులు, జనసేన పార్టీ నాయకులతో కలిసి టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగుణమ్మ నివాసానికి వెళ్లారు. దాదాపు అరగంటకు పైగా రెండు కుటుంబాలు ఏకాంతంగా మాట్లాడుకున్నాయి. అనంతరం మీడియాతో సుగుణమ్మ మాట్లాడారు. జనసేన- టీడీపీ- బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ టీడీపీలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు సద్దుమణిగాయని చెప్పారు. జనసేన, టీడీపీ, బీజేపీ కార్యకర్తలను, నాయకులను కుటుంబ సభ్యులుగా చూసుకుంటానని తెలియజేశారు. గత ఐదేళ్లుగా తిరుపతిలో సుగుణమ్మ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేశారని, వైసీపీ ఎమ్మెల్యే కరుణాకర రెడ్డి, వైసీపీ అభ్యర్థి అభినయ్ రెడ్డి తిరుపతి ప్రజలను వేధించారన్నారు. వైసీపీ నేతలు తిరుపతిని లూటీ చేశారని, టీడీఆర్ బాండ్లలో నిజమైన బాధితులకు న్యాయం చేస్తామన్నారు.తిరుపతిలో గంజాయి అమ్మకాలను అరికడతామని ప్రకటించారు.ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, టీడీపీ నాయకులు భట్టే వెంకట కీర్తి, చిట్టిబాబు, దంపూరి భాస్కర్, బుల్లెట్ రమణ, కృష్ణ యాదవ్, కంకణాల రజనీకాంత్ నాయుడు, రుద్రకోటి సదాశివం, బ్యాంకు శాంతమ్మ, ఆముదాల తులసీరాం, కొట్టే హేమంత్ రాయల్, ఆర్సీ శ్రీనివాస్, మునిరామయ్య, గొల్ల లోకేశ్ నాయుడు, విశ్వనాధం, కరాటే చంద్ర తదితరులు పాల్గొన్నారు.ఈ సమావేశంతో సుగుణమ్మ దాదాపుగా అలక వీడారని భావిస్తున్నారు.చంద్రబాబు రేణిగుంటలో తిరుపతి నేతలతో మాట్లాడిన తర్వాత వీరు చల్లబడ్డారని తెలుస్తోంది.

పీజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 1: యూనివర్సిటీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ దఫా ఏపీపీజీసెట్-2024 నిర్వహణ బాధ్యతను విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి ప్రభుత్వం అప్పగించింది. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంఎల్ఐఎస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీ తదితర కోర్సులు రాష్ట్రంలోని పలు వర్సిటీలు నిర్వహిస్తున్నాయి. వీటిలో ప్రవేశానికి ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు. సోమవారం నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించారు. సెట్స్.ఏపీసీహెచ్ఈ.ఏపీ.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా మే 4వ తేదీలోపు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రూ.500 రుసుంతో మే 15 వరకూ, రూ.1000తో మే 25వ తేదీదాకా గడువు ఉంది. జూన్ 10 నుంచి ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారు.

నాక్ సభ్యురాలిగా నారాయణమ్మ

యూజీసీ నాక్ పీర్ టీంలో సభ్యురాలిగా పద్మావతీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ నారాయణమ్మ నియమితులయ్యారు. ఉన్నత విద్యా సంస్థల్లోని నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి నాక్ గ్రేడింగ్ ప్రకటించే ప్రక్రియలో ఈమె భాగస్వామ్యం వహిస్తారు. టీటీడీ విద్యా సంస్థలకు సంబంధించి నాక్ పీర్ టీంకు ఎన్నికైన మొదటి వ్యక్తి ఆమే కావడం గమనార్హం. కామర్స్ అధ్యాపకురాలైన నారాయణమ్మ హాస్టల్ వార్డెన్‌గా, ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ప్రభుత్వం నుంచి ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్నారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ వి.కృష్ణవేణి, పలువురు అధ్యాపకులు ఆమెను అభినందించారు.

సిలబస్ మార్పు చేర్పులపై రేపు సమావేశం

నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) - 2020 ప్రకారం సిలబస్‌లో మార్పు చేర్పులపై ఈనెల 3వ తేదీన తిరుపతిలో సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఈ సమావేశం చేపట్టనున్నారు. తొమ్మిది సైన్స్, నాలుగు ఆర్ట్స్ కోర్సులకు సంబంధించిన సిలబస్ రూపకల్పన బాధ్యతను ఉన్నత విద్యా మండలి ఈ దఫా పద్మావతి వర్సిటీ, యోగి వేమన వర్సిటీలకు అప్పగించింది. ఇరు వర్సిటీల అధికారులు, బీఓఎస్ ఛైర్మన్లు, అకడమిక్ వ్యవహారాల అధికారులు ఈ సమావేశంలో పాల్గొంటారు. మార్పు చేర్పులపై ఉన్నత విద్యా మండలికి నివేదించనున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.35 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.4.35 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 81,224 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24,093 మంది తలనీలాలు సమర్పించారు.

శ్రీవారి ఆలయంలో మొదలైన రుగ్వేద పారాయణం

తిరుమల, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంలో సోమవారం రుగ్వేద పారాయణం మొదలైంది. ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 12 మంది నిష్ణాతులైన వేదపండితులు పాల్గొని పారాయణం చేశారు. లోకకల్యాణార్థం శ్రీవారిని ప్రార్థిస్తూ 2020 ఏప్రిల్ 11వ తేదీ నుంచి టీటీడీ చతుర్వేద పారాయణం ప్రారంభించింది. మొత్తం నాలుగు వేదాల్లోని ఐదు శాఖలు పారాయణం చేశారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 10 గంటల వరకు శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. చతుర్వేద పారాయణం వల్ల అనంతమైన ఫలితం సిద్ధిస్తుందని ఎస్వీ ఉన్నత వేద అధ్యయన సంస్థ ప్రాజెక్ట్ అధికారి ఆకెళ్ల విభీషణ శర్మ తెలిపారు.

ఎస్వీయూలో మతి స్థిమితం లేని యువతి సంచారం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 1: ఎస్వీ యూనివర్సిటీలో మతి స్థిమితం లేని యువతి సంచరిస్తోంది. 30 ఏళ్లలోపు వయస్సు కలిగిన తమిళనాడుకు చెందిన ఆ యువతి వారం రోజులుగా వర్సిటీలో తనలో తాను ఏదో మాట్లాడుకుంటూ, భుజంపై దుస్తులు వేసుకుని అన్నపూర్ణ క్యాంటీన్, శ్రీనివాసా ఆడిటోరియం కేంద్రాల వద్ద సంచరిస్తోంది. ఈమెను ఎవరైనా చేరదీసి, వివరాలు రాబట్టి ఇంటికి చేర్చడమో, ఆసరా కల్పించడమో, ఆరోగ్యాన్ని బాగు చేయించడమో చేస్తే మంచిదని వర్సిటీ వర్గాలు సూచిస్తున్నాయి.

పక్కా లోకల్...!

● ప్రశ్నార్థకంగా రక్షకభటుల బదిలీలు
● అధికారులకే పరిమితమైన ఎన్నికల కోడ్
● దశాబ్దాలుగా సొంత ప్రాంతాల్లో సిబ్బంది తిష్ట ● ఎన్నికల సమయంలో ప్రభావితం చేసే అవకాశం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1 : పోలీసు శాఖలో క్షేత్రస్థాయి సిబ్బంది చాలా చోట్ల దశాబ్దాలుగా ఒకే చోట పాతుకుపోయారు.వారిలో కొందరు రాజకీయ పార్టీలకు దాసోహం అయిపోయారు. ఎస్ఐ పైస్థాయి అధికారులు మాత్రమే కాలపరిమితి ముగిసిన తర్వాత బదిలీ అవుతున్నారు.హోంగార్డు నుంచి ఏఎస్ఐ వరకూ నిబంధనల ప్రకారం బదిలీ కావడం లేదు. ఎన్నికల కోడ్ సమయంలో తప్పనిసరిగా మూడేళ్ల కాల పరిమితి నిండిన అధికారులను బదిలీతో జిల్లా దాటిస్తుంటారు. క్షేత్రస్థాయి సిబ్బంది మాత్రం చాలామంది సంవత్సరాల తరబడి సొంతప్రాంతాల్లో రకరకాల కారణాలతో కొనసాగుతుం డడంపై ప్రతిపక్ష పార్టీల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

శాంతిభద్రతల పరిరక్షణలో రక్షకభటుల పాత్ర ఎంత కీలకమైనదో అందరికీ తెలిసిందే. ప్రధానంగా ఎన్నికల సమయాల్లో నిష్పక్షపాతంగా భద్రతా వ్యవస్థ వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ ఉద్దేశంతోనే ఎస్ఐ స్థాయి నుంచి అధికారులకు తరచూ స్థానచలనం కల్పిస్తుంటారు. ఇక ఎన్నికల కోడ్ సమయంలో అధికారుల బదిలీలు తప్పనిసరిగా జరిగి తీరుతుంటాయి. అయితే పోలీసు శాఖలో కిందిస్థాయి సిబ్బంది చాలామంది ఎక్కడివారు అక్కడే రాజకీయ బలంతో పాతుకుపోయారు. వాస్తవానికి సొంత మండలంలో, సబ్ డివిజన్ పరిధిలో ఒక కానిస్టేబుల్‌కు ఎప్పుడూ విధులు కేటాయించకూడదు. కానీ జిల్లావ్యాప్తంగా చాలామంది కానిస్టేబుళ్లు సొంత మండలాల్లోనే దశాబ్దాలుగా గడిపేస్తున్నారు. ఒకే సబ్ డివిజన్ పరిధిలో ఇలా 28 ఏళ్లుగా పనిచేస్తున్న వారు కూడా ఉండడం గమనార్హం. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఒకే డివిజన్‌లో పోలీస్ స్టేషన్లు మారుతూ రింగ్ మాస్టర్లుగా అక్కడే తిరుగుతున్నారు. శ్రీకాళహస్తిలో అలాగే చాలామంది రిటైరయ్యారు కూడా. ఇదిలా ఉండగా కొందరు వేరే సబ్ డివిజన్‌కు బదిలీ అయిన తర్వాత కూడా ఎస్పీ స్థాయి అధికారి ఇచ్చే అటాచ్మెంట్(డిప్యుటేషన్)తో వారికి కావాల్సిన స్థానాల్లో కొలువుదీరిపోయారు. తిరుపతి జిల్లాలో ఇలాంటి వారు 40శాతం దాకా వున్నారని సమాచారం. ఒక శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలో సుమారు 50మంది దశాబ్దాలుగా సొంత స్థావరం లోనే అటూ ఇటూ తిరుగుతున్నారు. సొంత స్థావరాల్లో క్షేత్రస్థాయి రక్షకబటులు వేళ్లూనుకుపోవడంతో అధికారులకు తలనొప్పులు తప్పడం లేదు. బయట ప్రాంతం నుంచి వచ్చిన అధికారులు స్టేషన్లో పాతుకు పోయిన సిబ్బందిని గట్టిగా ఆదేశించి విధులు కేటాయించలేకపోతున్నారు.పలు సందర్భాల్లో అధికారుల పైనే స్థానిక బలంతో సిబ్బంది తిరగబడిన ఘటనలున్నాయి. శాంతిభద్రతల సమస్యలు ఎదురైనా, అలాగే ఫిర్యాదులు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సమయాల్లోనూ క్షేత్రస్థాయి సిబ్బంది చేతివాటం చూపుతున్నారు. పోలీసులు స్థానికులు కావడంతో గట్టిగా ఆకతాయిలను కూడా మందలించలేకపోతున్నారు. అన్నీ తెలిసినా నాన్ లోకల్ భయంతో అధికారులు ఏమీ చేయలేక పోతున్నట్లు తరచూ వాపోతుంటారు.

ఇటీవల శ్రీకాళహస్తిలోని ఒక స్టేషన్లో జరిగిన ఘటన అందరినీ విస్మయానికి గురి చేసింది. ఒక సీఐ తమ శాఖ ఉన్నతాధికారి ముక్కంటి ఆలయానికి వచ్చిన సమాచారం తనకు ఎందుకు చెప్పలేదని కానిస్టేబుల్‌ను ప్రశ్నించాడు. దీంతో ఆ కానిస్టేబుల్ పోలీస్ స్టేషన్లో సిబ్బంది చూస్తుండగానే సీఐకి దురుసుగా సమాధానం ఇచ్చాడు. దాంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది.అంత జరిగినా ఆ అధికారి ఎవరికీ చెప్పుకోలేక లోలోపల మథనపడుతూనే తరువాత బదిలీపై వెళ్లిపోయాడు. ఇక వివాదాలు, ఆరోపణలు ఎదుర్కొన్న ఎందరో సిబ్బంది తమ రాజకీయ బలంతో ఏడాది కూడా తిరగకముందే తిరిగి అదే స్టేషన్లో పోస్టింగ్ పొందుతున్నారు. ఇక ఎన్నికల సమయంలో క్షేత్రస్థాయిలో పోలీసు సిబ్బంది తీవ్ర ప్రభావితం చేసే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది.

ఇటీవల పోలీస్ స్టేషన్లో కొత్త అధికారులు కొలువుదీరారు.వారు నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్న ఉద్దేశంతో ఏ నిర్ణయం తీసుకున్నా క్షణాల్లో అధికార పార్టీ నాయకులకు చేరిపోతోంది. అన్ని పోలీస్ స్టేషన్లలో స్థానికులుండడం అధికార పార్టీకి వరంగా మారింది. ఒకే చోట ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న వారికి బలమైన పరిచయాలు ఏర్పడ్డాయి. అదే ప్రాంతాల్లో రేపు పోలింగ్ బూత్‌ల వద్ద క్షేత్రస్థాయి విధులు కేటాయించాల్సి ఉంటుంది. దాంతో ఒకే చోట పుట్టి, పెరిగి, విధులు నిర్వహించిన సిబ్బంది చాలా సులభంగా ప్రజలను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. అలాగే రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యవహరించేందుకు కూడా వారికి చాలా అవకాశం ఉంది.క్షేత్రస్థాయి పరిస్థితులను లోతుగా పరిశీలించి జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ చిరకాలంగా పాతుకుపోయిన రక్షకభటులను బదిలీ చేసే ప్రక్రియను ఉన్నతాధికారులు చేపట్టాల్సివుంది.

పెన్షన్ డబ్బును కాంట్రాక్టర్లకు బదలాయించిన సీఎం జగన్

● టీడీపీ నేతలు



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 1: సామాజిక పెన్షన్ డబ్బును సీఎం జగన్ తమకు అనుకూలమైన కాంట్రాక్టర్లకు బదలాయించారని టీడీపీ నేతలు ఆరోపించారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్ మీడియాతో మాట్లాడుతూ.. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛను సొమ్ము ఇవ్వకుండా.. తనకు అనుకూలమైన కాంట్రాక్టర్లకు బదిలీచేసి ఖజానా ఖాళీ అయిందని సీఎం జగన్ రెడ్డి సాకులు చెబుతున్నారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించడం వల్ల ఖజానా ఖాళీ అయిందని.. తిరిగి డబ్బులు సమకూర్చడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్ మాట్లాడుతూ.. వలంటీర్లద్వారా కాకుండా ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పెన్షన్లు పంపిణీ చేయాలని ఈసీ ఆదేశించిందని గుర్తించాలని చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రకుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు, రైతులు అప్పుల ఊబినుంచి బయటపడాలన్నా, మహిళలకు ఆర్థిక స్వావలంబన కలగాలన్నా టీడీపీ అధికారంలోకి రావాలని చెప్పారు. జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థి గురజాల జగన్మోహన్‌ను గెలిపించాలని కోరారు. నేతలు శశికర్ బాబు, శ్రీనివాస్, త్రిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమై సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య



ప్రేమ్‌కుమార్ (ఫైల్ ఫొటో)

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 1: ప్రేమ విఫలమై ఓ సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి జిల్లా రామచంద్రపురం మండలం అనుపల్లె గ్రామ పంచాయతీ ఉప్పిలివంకకు చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు ప్రేమ్‌కుమార్ (27) ఏఎంపురం గ్రామ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఎస్ఆర్‌పురంలోనే ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ స్థానికంగా ఓ మహిళ ప్రేమలో పడ్డాడు. ఆమె పెళ్లికి అంగీకరించక పోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. అద్దె ఇంట్లోనే ఆదివారం రాత్రి కమ్మీకి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు సమాచారంతో సోమవారం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు ఎస్ఆర్‌పురానికి చేరుకుని బోరున విలపించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కుళాయప్ప తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఉప్పిలివంకలో విషాదఛాయలు

రామచంద్రాపురం, ఏప్రిల్ 1: ప్రేమ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. వారు ఉప్పిలివంకకు తీసుకురావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మట్టి అక్రమ రవాణా

● పట్టించుకోని రెవెన్యూ అధికారులు



చింతమండి వద్ద ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిపోతున్న మట్టి

కార్వేటినగరం, ఏప్రిల్ 1: కార్వేటినగరం మండలం చింతమండి వద్ద గుట్ట నుంచి మట్టి అక్రమ రవాణా జోరుగా సాగుతున్నా రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. పుత్తూరు - చిత్తూరు జాతీయ రహదారిపై మట్టి అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ప్రభుత్వ గుట్టలోని మట్టిని కొంతమంది అక్రమ రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఎన్నికల నేపథ్యంలో మండల రెవెన్యూ అధికారులు బిజీగా ఉండటంతో ప్రభుత్వ భూముల్లోని మట్టిని అక్రమార్కులు యథేచ్ఛగా దోచేస్తున్నారు. రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

స్మగ్లరు అరెస్టు.. దుంగలు స్వాధీనం



స్మగ్లరు, వాహనం, ఎర్రచందనం దుంగలతో పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది

పీలేరు, ఏప్రిల్ 1: ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న ఒక స్మగ్లరును అరెస్టు చేయడంతోపాటు వాహనం 10 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్‌వో జేవీ సుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. సుండుపల్లె అటవీ ప్రాంతం నుంచి పీలేరు మీదుగా చెన్నైకు ఎర్రచందరం అక్రమ రవాణా జరగుతోందన్న సమాచారం మేరకు కలికిరి వైపు నుంచి కందూరు వైపు వేగంగా వచ్చిన కారును అడ్డుకుని తమిళనాడు రాష్ట్రం జమునాముత్తూరుకు చెందిన తాతన్ అనే వ్యక్తిని పట్టుకున్నామన్నారు. కారును తనిఖీ చేయగా అందులో 345 కేజీలు బరువున్న 10 ఎర్రచందనం దుంగలు లభించాయన్నారు. దీంతో స్మగ్లరు, కారుతో సహా వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడిలో ఎఫ్ఆర్‌వో వెంకటరమణ, ఎఫ్‌బీవో ప్రతాప్, సిబ్బంది చరణ్, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నట్లు ఆయన వివరించారు.

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 1: మదనపల్లె మండలం సీటీఎం గ్రామం వద్ద రైలు కింద పడి ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. కదిరి రైల్వే ఎస్ఐ రహీం కథనం మేరకు.. తిరుపతి నుంచి ధర్మవరం వైపు వెళుతున్న రైలు సీటీఎం ఆంజనేయస్వామి ఆలయం వద్దకు రాగానే అక్కడే వున్న ఓ మహిళ(34) హఠాత్తుగా రైలు కింద పడిపోయి అక్కడిక్కడే మృతి చెందిందన్నారు. స్థానికులు గమనించి రైల్వే అధికారులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకుని మృతురాలి వివరాలు సేకరిస్తున్నామని రైల్వే ఎస్ఐ తెలిపారు.

టీడీపీ సీనియర్ నాయకుడు మృతి



రమణ (ఫైల్ ఫోటో)

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 1: మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీకి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు స్టోర్ రమణ గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం మధ్యాహ్నం వలసపల్లె పంచాయతీ కాకరకాయలపల్లెలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషా సమావేశం నిర్వహించడానికి అన్నీ తానై ముందుకు నడిపిన రమణ, రాత్రి కాగానే ఇంట్లో హఠాత్తుగా సొమ్మసిల్లి పడిపోయాడు. కుటుంబీకులు గమనించి ఆస్పత్రికి తరలించే లోపే రమణ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఉమ్మడి అభ్యర్థి షాజహాన్ బాషా, ఆర్జే వెంకటేశ్, శేఖర్‌నాయుడు తదితరులు రమణ భౌతిక కాయానికి నివాళులర్పించి అతని కుటుంబీకులకు ధైర్యం చెప్పారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ విస్తృత తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి మురళిమోహన్, తదితరులు

నిమ్మనపల్లి, ఏప్రిల్ 1: సార్వత్రిక ఎన్నికలల్లో భాగంగా నిమ్మనపల్లి, రెడ్డివారిపల్లి వెంగంవారిపల్లి పరిసర ప్రాంతాలలో సోమవారం వాహనాల విస్తృత తనిఖీలు చేసినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి మురళీమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున ఒక వ్యక్తి రూ.50వేల కంటే ఎక్కువ నగదును తీసుకెళ్లరాదని తెలిపారు. ఒక వేల నగదుకు సంబంధించి సరైన పత్రాలు చూపిస్తే అటువంటి వాటిని అనుమతిస్తామన్నారు. అలాగే బస్సులు, ద్విచక్ర వాహనాలు, ఇతర కార్లు, వాహనాలను తనిఖీ చేసి సామగ్రితో పాటు నగదు, వాహన వివరాలను అడిగి తెలుసుకొంటున్నారు. మద్యం, గంజాయి, తదితర వాటి సరఫరాపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. ఇవే కాకుండా నలుగురు మించి గుమిగూడి వుండరాదని తెలిపారు. ఎన్నికలు ముగిసేంత వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈుర్ ఎస్ఐ శ్రీనివాసులు, పోలీసులు పాల్గొన్నారు.

సీఏఏ అమలుపై జగన్ స్పష్టత ఇవ్వాలి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 1: ముస్లిం మైనార్టీల ఉనికిని దెబ్బకొట్టి వారి భవిష్యత్‌ను అంధకారం చేస్తున్న సీఏఏ(పౌరసత్వ సవరణ చట్టం) అమలుపై వైసీపీ అధినేత జగన్ మదనపల్లెలో నిర్వహించే బహిరంగ సభలోనైనా స్పష్టత ఇవ్వాలని వీసీకే పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల తరహాలో ఏపీలోనూ సీఏఏ చట్టం అమలు చేయబోమని సీఎం జగన్ ప్రకటించడం అవసరమని ఆయన పేర్కొన్నారు. మైనార్టీలను ఉద్ధరిస్తామని గొప్పలు చెప్పే జగన్ ఇప్పటికీ దీనిపై స్పష్టత ఇవ్వకపోవడం సహేతుకంగా లేదన్నారు. దేశంలోని ముస్లింలకే కాకుండా అన్ని మతాలకు చెందిన ప్రజలు ముఖ్యంగా పేద, మధ్యతరగతి, ఆదివాసీలు, దళిత బలహీన వర్గాల వారు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. వైసీపీ అధినేత జగన్ తాము అధికారంలోకి వస్తే రాష్ట్రంలో సీఏఏ అమలు చేయబోమని ప్రకటించిన తరువాతే ప్రజల్ని ఓట్లు అడగాలని సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

తరిగొండలో అమలు కాని కోడ్



శిలాఫలకంపై ఉన్న నాయకుల ఫోటోలు

గుర్రంకొండ, ఏప్రిల్ 1:గుర్రంకొండ మండలం తరిగొండ బీసీ కాలనీలో ఎన్నికల కోడ్ అమలు కావడం లేదు. ఈ కాలనీలో రెండు నెలల క్రితం రూ. 3 లక్షలతో ఎంపీ నిధులతో మురుగు కాలువ పనులు చేశారు. ఈ కాలువ పనులు పూర్తి కావడంతో ఫిబ్రవరి 14న ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి గానూ శిలాఫలకం ఏర్పాటు చేశారు. ఈ శిలాఫలకంపై సీఎం, మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యే, ఇతర వైసీపీ నాయకుల ఫొటోలు ముద్రించారు. ఎన్నికల కోడ్ ప్రారంభమై దాదాపు 17 రోజులు గడుస్తున్న అధికారులకు ఈ శిలాఫలకం కనబడకపోడం గమనార్హం. బీసీ కాలనీలో శిలాఫలకంపై కోడ్ అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కలకడ, ఏప్రిల్ 1:కలకడ బాలిక గురుకుల పాఠశాల్లో ప్రవేశానికి గడువును ప్రభుత్వం ఈ నెల 5వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ సుమిత్ర తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశం, 6,7,8వ తరగతిలో మిగిలిన సీట్ల కోసం ఆసక్తి గల బాలికలు గడువులోగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని కోరారు.

ముస్లింలను ఎన్నిసార్లు మోసం చేస్తారు

● జగన్‌పై టీడీపీ ముస్లిం మైనారిటీ నాయకుల ధ్వజం ● ఐదేళ్లలో యువతకు అన్యాయం చేశారంటూ తెలుగుయువత ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ముస్లిం మైనారిటీ నాయకులు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 1: మదనపల్లెలోని ముస్లిం మైనారిటీలను ఎన్నిసార్లు మోసం చేస్తారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై టీడీపీ ముస్లిం మైనారిటీ నాయకులు ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక సుభాష్‌రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో మైనారిటీ విభాగం నాయ కులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఏ మస్తాన్ మాట్లాడుతూ మదనపల్లెలో టిప్పు సుల్తాన్ మసీదు నిర్మాణం కోసం రూ.5కోట్లు కేటాయిస్తానని గత నవంబరు 30న మదనపల్లె పర్యటనలో జగన్ ముస్లీంలకు మాట ఇచ్చారన్నారు. ఇది జరిగి నాలుగు నెలలు అవుతు న్నా కనీసం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయించలేదన్నారు. మదనపల్లె పట్టణంలో సీసీ రోడ్లు, మురుగుకాలువల నిర్మాణం కోసం రూ.30 కోట్లు ప్రతిపాదనలు ఇచ్చారని, వాటిని కూడా ఆమోదిస్తానని జగన్ చెప్పారని కాని సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు ఎక్కడ నిర్మాణాలు జరిగాయని ప్రశ్నించారు. టీడీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎం రఫీ మాట్లాడుతూ పట్టణంలో మూడు బ్రిడ్జిలు నిర్మాణం కోసం రూ.14 కోట్లు మంజూరు చేస్తానని, బాహుదా నదిమీద బ్రిడ్జి నిర్మాణా నికి రూ.7.30 కోట్లు మంజూరు చేస్తానని జగన్ మాట ఇచ్చారన్నారు. కాని నాలుగు నెలలు గడుస్తున్నా ఒక్క హామీని కూడా అమలు చేయ లేదని విమర్శించారు. నాగూర్‌వలి మాట్లాడుతూ కల్లబొల్లి మాటలు చెప్పి మదనపల్లె ప్రజలను మోసం చేసిన సీఎం జగన్ మళ్లీ అదే టిప్పుసుల్తాన్ మైదానంలో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు వస్తున్నారని ప్రజలు జగన్ మాటలను నమ్మే స్థితిలో లేరన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌ఖాన్, అన్వర్‌బాషా, దాదాపీర్, బావాజాన్, ఇంతియాజ్ తదితరులుపాల్గొన్నారు.

ఐదేళ్లలో యువతకు జగన్ మొండిచేయి చూపారు

రాష్ట్రంలో ఐదేళ్లలో సీఎం జగన్ యువతకు మొండి చేయి చూపారని తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు నాదెళ్ల అరుణ్‌తేజ ధ్వజమెత్తారు. స్థానిక దేవతానగర్‌లోని టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ డిగ్రీ, పీజీ చదివిన యువతను వైన్ షాపుల్లో సేల్స్‌మెన్‌గా, వలంటీర్లుగా వాడుకుంటూ వారి కష్టాన్ని దోచుకుతింటున్నారన్నారు. విశాఖ డ్రగ్స్ కేంద్రంగా మారిపోయిందని, రాష్ట్రంలో పండించే గంజాయి దేశ వ్యాప్తంగా అక్రమంగా రవాణా చేస్తున్నారన్నారు. అలాంటి జగన్ మదనపల్లెకు మళ్లీ ఎందుకు ఓట్లు అడిగేందుకు వస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

సాంకేతికతకు మూలం సైన్సు

●కల్పకం అటామిక్ రీసెర్చ్ శాస్త్రవేత్త డాక్టర్ జాన్ ఫిలిప్



సైన్సుపై విద్యార్థులకు సూచనలిస్తున్న కల్పకం అటామిక్ రిసెర్చ్ శాస్త్రవేత్త జాన్ ఫిలిప్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 1: ఇంజినీరింగ్ విద్యకు, మానవుని మనుగడకు సైన్సు మూలమని కల్పకం అటామిక్ రీసెర్చ్ శాస్త్రవేత్త డాక్టర్ జాన్ ఫిలిప్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో న్యూఢిల్లీకి చెందిన ఇండియన్ నేషనల్ సైన్సు అకాడమి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయస్థాయి వర్క్‌షాప్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జాన్ ఫిలిప్ మాట్లాడుతూ దేశంలో మూడు సైన్సు అకాడమిలు ఉండగా ప్రతి మూడు నెలలకు ఒక సారి సైన్సుపై జాతీయ వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటి వరకు ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో వర్క్‌షాప్‌లు నిర్వహించామని, ఈ సారి న్యాక్ ఏ ప్లస్ గుర్తింపు పొందిన జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల ఈ మూడు రోజుల వర్క్‌షాప్‌కు ఎంపికైందన్నారు. మదనపల్లె డివిజన్‌లోని గ్రామీణ విద్యార్థులకు సైన్సు వర్క్‌షాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. చెన్నైలోని శివనాడార్ యూనివర్సిటి ప్రొఫెసర్ ఎన్‌పీ రాజేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు చురుగ్గా వుంటారని సైన్సు పట్ల వారికి అవగాహన పెంచితే తప్పకుండా గొప్ప శాస్త్రజ్ఞులు అవుతారన్నారు. ఉన్నత విద్యాశాఖ ఆర్జేడీ పి.బాబు, ఎస్వీయూ ప్రొఫెసర్లు విజయభాస్కరరావు, దేవప్రసాదరాజు విద్యార్థులకు సూచనలు అందజేశారు. ఈ వర్క్‌షాప్‌కు జయశంకర్ కన్వీనర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ ఎస్.రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, అసిస్టెంట్ ప్రొఫెసర్ రామాంజులు, 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 1: మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో భానుప్రసాద్ ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లుతో సమావేశంనిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రస్తుతం నాలుగు గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించామన్నారు. బోర్లలో నీటి శాతం ఇంకిపోయే అవకాశం వున్న చోట్ల ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది సహకారంతో సామాజిక పింఛన్ల పంపిణీపై దృష్టి పెట్టాలన్నారు. దీంతో పాటు ఎన్నికల కోడ్ అమలులో ఎక్కడ కూడా రాజీపడకూడదని, ఇలాంటి సంఘటనలు బయటపడిన వెంటనే ఉన్నతాధికారులకు నివేదికలు పంపాలన్నారు. రద్దీ కూడలిప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చందన, ఈవోఆర్డీ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

వేసవిలో నీటిని పొదుపుగా వాడుకోండి

తంబళ్లపల్లె, ఏప్రిల్ 1: వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఎంపీడీవో క్రిష్ణమూర్తి సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ...వేసవిలో మారుమూల గ్రామాలలో భూగర్భజలాలు అడుగంటి తాగు నీటి సమస్య ఏర్పడిన వెంటనే ప్రత్యామ్నాయంగా నీటి ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా బుధవారం నుంచి ఎన్నికల నిబంధనల మేరకు వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్ల పంపిణీపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ దిలీప్‌కుమర్‌నాయక్, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్మికులకు పెండింగ్ జీతాలను చెల్లించండి



నిరసన తెలియజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 1:పారిశుద్య కార్మికులకు, సెక్యూరిటీ గార్డులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని, ప్రతి నెల .జీతం మొదటి వారం లోనే వేతనాలు చెల్లించాలనిడిమాండ్ చేశారు.ఏపీ గెజిట్ ప్రకారం రూ.12688 కనీస వేతనం ఇవ్వాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు కల్పించిన ఆప్కాస్‌లో చేర్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మదనపల్లె కార్యదర్శి తిరుమల, అరవింద్, వెంకటరమన, తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండ గోశాలకు పశుగ్రాసం వితరణ

తంబళ్లపల్లె, ఏప్రిల్ 1: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండ గోశాలకు తంబళ్లపల్లె నాగేంద్రవీధికి చెందిన సతీష్ మూడు ట్రాక్టర్ లోడ్ల పశుగ్రాసాన్ని (ఎండు మొక్కజొన్న కర్రలు) వితరణగా ఇచ్చి మూగ జీవాల పట్ల ప్రేమను చాటుకున్నాడు. సోమవారం దాత అందచేసిన పశుగ్రాసాన్ని స్థానికులు మెడికల్ స్టోర్ నారాయణరెడ్డి, సహదేవ, రామ్మూర్తి, శ్రీనివాసులు మల్లయ్యకొండ పైన ఉన్న గోశాలకు వద్దకు చేర్చి సిబ్బందికి అందచేశారు. సతీష్ దాతృత్వం పట్ల ఆలయ సిబ్బందితో పాటు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముస్లింలను ఓట్లు అడిగే హక్కు జగన్‌కు లేదు

● కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు రెడ్డిసాహెబ్



కాంగ్రెస్ పార్టీకార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ నాయకుడు రెడ్డిసాహెబ్

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 1: ముస్లిం మైనార్టీలను ఓట్లు అడిగే నైతిక హక్కు సీఎం జగన్‌కు లేదని మదనపల్లె కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు రెడ్డిసాహెబ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చేయలేని జగన్‌కు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. వైసీపీ ఎంపీలు ఎన్ఆర్సీకి మద్దతు తెలుపుతూ ఓట్లు వేసి ముస్లిం మైనార్టీలకు అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. నేడు మదనపల్లెలో జరిగే సిద్ధం బహిరంగసభలో జగన్ వాటికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో మదనపల్లె అభివృద్ధికోసం 14 కోట్లు, ప్లైవర్, టిప్పుసుల్తాన్ మైదానం ప్రహరీ నిర్మాణం కోసం ఐదు కోట్లు మంజూరు చేస్తామన్న సీఎం జగన్ ఒక్క రూపాయి నిధులు విడుదల చేయలేదన్నారు. మద్య నిషేధం చేసి 2024 ఎన్నికలకు వస్తామని చెప్పి నాసిరకం మద్యంతో పేదల ప్రాణాలు తీస్తునున్నారని ఆరోపించారు. జగన్ ఏపీని అప్పుల్లోకి నెట్టేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ ఎస్‌కేబాషా, మీనాకుమారి, సురేంద్రరెడ్డి, ముబారక్‌ఖాన్, రవీంద్ర, నారాయణరెడ్డి, సోముశేఖర్, శ్రీనివాసులు, షాజహాన్‌బాషా, ద్వారకనాథరెడ్డి, సమీర్, ఈశ్వరమ్మ, మహబూబ్‌పీర్, పాలేటి,సయ్యద్, మహమ్మద్‌అలీ, అమీర్‌జాన్, బయ్యారెడ్డి, అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సైనికులకు మధుబాబు ఆదర్శం



రాటకొండ మధుబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ, జనసేన నాయకులు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 1: క్రమశిక్షణ గల టీడీపీ సైనికులకు సీనియర్ నాయకుడు రాటకొండ మధుబాబు ఆదర్శంగా నిలుస్తున్నారని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేశ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక నిమ్మనపల్లె సర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయంలో మధుబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ టీడీపీ కోసం అహర్నిశలు కష్టపడుతూ, వైసీపీ పాలనలో ఎన్నో అక్రమ కేసుల్లో ఇరుక్కున్న మధుబాబు ఎంత కష్టమొచ్చినా వెరవ లేదన్నారు. అనంతరం మధుబాబు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. టీడీపీ, జనసేన నాయకులు శ్రీరామ రామాం జనేయులు, దారం అనిత, నవీన్, విజయమ్మ, అన్వర్‌బాషా, నిరంజన్‌నాని, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలుర జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 1: మదనపల్లె పట్టణంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళా శాల ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదవ్ డిమాండ్ చేశారు. మద నపల్లె పట్టణంలో గతంలో బీటీ కళాశాలలో బాలురకు జూనియర్ కళాశాల అందుబాటులో వుండేదని, ఇప్పుడు ప్రభుత్వం బీటీ కళాశాలను ప్రభుత్వ డిగ్రీ కళాశాలగా మార్చడంతో జూనియర్ కళాశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మదన పల్లె పర్యటనకు వచ్చే సీఎం జగన్‌కు ఈ మేరకు వినతి పత్రం ఇస్తామని తెలిపారు.

సమైక్యతను చాటడానికే ఇఫ్తార్ విందు



మాట్లాడుతున్న బహుజనసేన రాష్ట్రఅధ్యక్షుడు శ్రీచందు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 1: పవిత్రరంజాన్‌మాసంలో సమైక్యతను చాటడానికే బహుజనసేన ఆధ్వర్యంలో ఉపవాసదీక్షలో ఉన్న ముస్లింలకు ఇఫ్తారు విందు ఇచ్చినట్లు బహుజనసేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు పేర్కొన్నారు. మదనపల్లెలోని రామారావు కాలనీ మసీదు వద్ద ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి వారి ఉపవాసదీక్షను బహుజనసేన సభ్యులు విరమింపచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకలి విలువలు తెలుసుకోడమే రంజాన్‌ఉపవాసదీక్ష ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఎస్టీ నాయకులు కోనేటి దివాకర్, బహుజనసేన రాష్ట్ర నాయకులు కొండపల్లె ఆనంద్,మూడే రూపేనాయక్, జయశంకర్, నజీర్‌ఖాన్, సయ్యద్, అహ్మద్‌ఖాన్, చెన్నారెడ్డి, వెంకీ పాల్గొన్నారు.

నేడు, రేపు వైభవంగా గంగ జాతర

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 1 : మండలంలోని పలు గ్రామాల్లో మంగళ, బుధవారాల్లో గంగజాతరలు జరుగనున్నాయి. మండల కేంద్రమైన పీటీఎంలో గంగ జాతరకు భారీ ఏర్పాట్లను చేశారు. ముందుగా మంగళవారం ఉదయం నుంచి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం అమ్మవారికి మహిళలు జ్యోతులు మోసి మొక్కులు తీర్చుకుంటారు. అనంతరం జంతుబలినిచ్చి మొక్కులు తీర్చుకుంటారు. బుధవారం రాత్రి అమ్మ వారిని పుర వీధులో అమ్మవారిని ఊరేగించిన అనంతరం గ్రామ పొలిమేరల్లో వదిలిపెట్టడంతో జాతర ముగుస్తుంది.

తంబళ్లపల్లెకు ఇచ్చిన హామీలు ఎగ్గొట్టి ఎలా వస్తావ్?

● హంద్రీ - నీవా జలాల ద్వారా చెరువులు నింపుతానని మరిచావు
● పంటలకు గిట్టుబాటు, ఫ్లోరైడ్ సమస్య పరిష్కరిస్తానన్నావు
● పింఛన్ల పంపిణీపై దుష్ప్రచారం చేస్తే అవ్వాతాతలు నమ్మరు
● సీఎం జగన్‌పై కూటమి ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డి విమర్శ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఏప్రిల్ 1: తంబళ్లపల్లె నియోజకవర్గానికి ఇచ్చిన హామీలు ఎగ్గొట్టిన మళ్లీ ఇక్కడికి ఎలా వస్తున్నావని సీఎం జగన్‌ను తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి ప్రశ్నించారు. ములకలచెరువులోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2017 లో సీఎం జగన్ ప్రతిపక్ష నేతగా తంబళ్లపల్లె నియోజకవర్గంలో పాదయాత్ర చేసినప్పుడు హంద్రీ - నీవా జలాల ద్వారా నియోజకవర్గంలోని అన్ని చెరువులు, కుంటలు నింపుతానని ప్రజలకు మాటిచ్చి మరిచాడన్నారు. వైసీపీ ప్రభుత్వం తెగిపోయిన హంద్రీ - నీవా కాలువకు మరమ్మత్తులు కూడా చేపట్టలేదన్నారు. ఫ్లోరైడ్ సమస్యతోపాటు నియోజక వర్గంలో పండే వేరుశనగ, టమోటాలకు గిట్టుబాటు కల్పిస్తానని చెప్పి పట్టించుకోలేదన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేని జగన్‌కు మళ్లీ ఇక్కడికి వచ్చే అర్హత లేదన్నారు. వైసీపీ పాలనలో నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరుగలేదన్నారు. పింఛన్ల పంపిణీపై వైసీపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని అవ్వాతాతలు నమ్మనన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఎన్నికల కమిషన్ సచివాలయ ఉద్యోగాల ద్వారా ఫించను పంపిణీ చేయిస్తోందన్నారు. రెండు నెలల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నకిష్టా, నాయీ బ్రాహ్మణ సెల్ జిల్లా అధ్యక్షుడు కేశవులు, నాయకులు రమణారెడ్డి, గాండ్ల రెడ్డెప్ప, సోమశేఖర్, నాగేంద్ర, విజయ్‌కుమార్, ప్రతాప్, రంగాళ్ళ శ్రీనివాసులు, మౌలాసాహెబ్, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

పేదల రాజ్యం రావాలంటే.. టీడీపీ రావాలి



తరిగొండలో టీడీపీ పథకాలను వివరిస్తున్న నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

గుర్రంకొండ, ఏప్రిల్ 1:రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలన పోయి పేదల రాజ్యం రావాలంటే ప్రజలు తెలుగుదేశం పార్టీని ఆదరించాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తరిగొండలో సోమవారం బాబు షూరిటీ..భవిష్యత్ గ్యారంటీ, సూపర్‌సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పాలనలో ఇసుక నుంచి నిత్యావసర సరుకుల వరకు రేట్లను ఇష్టానుసారంగా పెంచి ప్రజలను దగా చేసిందన్నారు. పేదలు ప్రశాంతంగా జీవించాలంటే తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. అంతేకాకుండా బీసీలకు ప్రత్యేక చట్టం కూడా టీడీపీ తీసుకొస్తుందని వివరించారు. ప్రజలు రాబోయే ఎన్నికల్లో ఆలోచించి సమర్థులైన నాయకులకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్ కుమార్, చంద్రబాబు, దేవిక, జయప్రకాశ్, నౌషాద్‌అలీ, రమణారెడ్డి, షబ్బీర్ అహ్మద్, హేస్సాన్, మహాత్మారెడ్డి, కాంత్రి, ప్రకాశ్, చలమారెడ్డి, రెడ్డిశేఖర్, హరిప్ర సాద్‌నాయుడు, ప్రదీప్, జ్యోతిరెడ్డి, నాగేంద్ర, జయసూరి, మేకల చలపతి, మురళీ, సుబ్బ రాజు తదితరులు పాల్గొన్నారు.

కలకడలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు



నల్లారి కిశోర్ సమక్షంలో టీడీపీలో చేరిన మైనారిటీ నాయకులు

కలకడ, ఏప్రిల్ 1:కలకడలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన మండల కోఆప్షన్ మెంబరు టీఎస్ఇనాయతుల్లాతోపాటు పలువురు వార్డు సభ్యులు వంద మైనారిటీ కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం రాత్రి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వారంతా టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తన అన్న నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో మైనారిటీలకు అనేక అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. ఎప్పటిలానే నల్లారి కుటుంబాన్ని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మద్దిపట్ల సూర్యప్రకాశ్, వెంకటరమణనాయుడు, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, మల్లికార్జునాయుడు, పివినాయుడు, ఆనంద్‌నాయుడు, వసంతనాయుడు, బీవీరమణ నాయుడు, షబ్బీర్‌అహ్మద్, జిలానీ, కరీముల్లా, ఇమ్రాన్, ఇర్ఫాన్, అలీ, నౌషాద్ పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండలంలోని బూడిదవేడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మదనమోహన్‌రెడ్డి, నందకుమార్‌రెడ్డిలు తమ అనుచరులతో కలిసి ఆదివారం రాత్రి నగిరిపల్లెలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి సమక్షంలో చేరగా ఆయన కండువాలు వేసి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అరాచకాలతో విసిగిపోయిన నాయకులు తమ పార్టీలోకి వస్తున్నారని, ఎన్నికల్లో సీఎం జగన్ ఇంటికెళ్లడం తథ్యమన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిదిదే అధికారమని ప్రజలే భరోసా ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, బీసీ పార్టీ రాజంపేట పార్లమెంట్ కన్వీనర్ వేణుగోపాల్, నాయకులు నారాయణరెడ్డి, శ్రీనాథరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేకే అసత్య ప్రచారాలు




పీలేరులో ప్రచారం నిర్వహిస్తున్న నల్లారి తనూజా రెడ్డి

పీలేరు, ఏప్రిల్ 1: రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ప్రజల్లో లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని కూటమి పీలేరు అసెంబ్లీ అభ్యర్థి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనూజారెడ్డి పేర్కొన్నారు. పీలేరులోని పాత మసీదువీధి, నెహ్రూ బజా రు, పాలాలవారివీధి, సదుం రోడ్డు, ఎన్టీఆర్ నగర్ ప్రాంతాల్లో సోమవారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్లు బీజేపీతో అనధికారికంగా అంటకాగిన వైసీపీ నాయకులు, టీడీపీ, బీజేపీ బహిరంగంగా పొత్తు పెట్టుకోవడాన్ని సహించలేకపోతున్నారన్నారు. సీఏఏ, ఎన్ఆర్సీ, త్రిపుల్ తలాక్ వ్యవహారాలపై ముస్లింలలో అపోహలు సృష్టిస్తున్నారన్నారు. టీడీపీ ఆది నుంచి ముస్లింలకు రక్షణ కవచంలా నిలబడిందన్నారు. భవిష్యత్తులో కూడా ముస్లింలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా కాపాడే బాధ్యత టీడీపీదేనన్నారు. వైసీపీ నాయకులు మాయమాటలు నమ్మకుండా త్వరలో జరగనున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీకి ప్రజలను ఓటు అడిగే హక్కు లేదు..

● టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషా



కుప్పనపల్లెలో పార్టీ సీనియర్ నాయకులతో మాట్లాడుతున్న షాజహాన్‌బాషా

రామసముద్రం, ఏప్రిల్ 1: వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో మదనపల్లె నియోజకవర్గంలో ఏ విధమైన అభివృద్ధి చేయలేదని అందుకే ప్రజలను ఓటు అడిగే హక్కు ఆపార్టీకి లేదని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మండలంలోని పెద్దకురప్పల్లె, మాలేనత్తం, అరికెల పంచాయతీలలో సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. అరికెల పంచాయతీ కేంద్రంలో వైసీపీకి చెందిన ఉప సర్పంచ్ రెడ్డెప్ప సారథ్యంలో 27కుటుంబాలు షాజహాన్, మండల పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌గౌడు సమక్షంలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా షాజహాన్ మాట్లాడుతూ అవ్వాతాతల పెన్షన్ల పంపిణీపై వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తోందని విమర్శించారు. మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కొండూరు నారాయణరెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, శ్రీనాథ్, శ్రీనివాస్ గౌడు, రమేష్, కృష్ణప్ప, తరకారి రమణ, ఈశ్వర్‌రెడ్డి, మహేష్, కృష్ణంరాజు, శివశంకర్, రాజేష్, బోయ రమణప్ప, సీనప్ప అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మదనపల్లెలో షాజహాన్‌బాషా విస్తృత ప్రచారం

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 1: మదనపల్లె మండలంలో టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సోమవారం మండలంలోని పొన్నేటిపాళెం, రామిరెడ్డిగారిపల్లె, సవరంవారిపల్లె, మోట్లపల్లెలో షాజహాన్‌బాషా ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు ప్రకటిం చిన సూపర్ సిక్స్ పథకాలను బూత్ ఇన్‌చార్జులు, గ్రామ కమిటీనాయకులు ఇంటింటా ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేసీబీ ఈశ్వరనాయుడు, మధుసూధన్‌రెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.